PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 01.03.2013, శుక్రవారం
సంపుటి : 32 సంచిక : 39
పేజీలు : 12, వెల : ₹ 4

24గం॥ చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్
నెలలు తక్కువ బిడ్డా ?
సంరక్షణ కొరకు...
Dr. T. Ravikumar's
రిచ్ హాస్పిటల్
రవి చిన్నపిల్లల హాస్పిటల్
పుట్టిన పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU)



# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# పార్టీలో టాప్... పాలనలో ఫ్లాప్

- ప్రత్యర్థులను సమర్థవంతంగా ఎదుర్కొన్న సిఎం

**ముఖ్యమంత్రిగా కిరణ్‌కుమార్‌రెడ్డిని మారుస్తారనే వూహాగానాలకు దాదాపు తెరపడినట్లే.**

ఇక ఎన్నికల సీజన్ మొదలు కానున్న నేపథ్యంలో కిరణ్‌ను మారిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికిప్పుడు పుంజుకునేది ఏమీ లేదు. కిరణ్‌ను మార్చినంతమాత్రాన ఆయన తర్వాత వచ్చే వాళ్లు ఆయనకంటే సమర్థవంతంగా వెలగబెడతారనే గ్యారంటీ కూడా లేదు. ఒకవేళ మార్పు అంటూ జరిగితే గొర్రెలు తినేవాడు పోయి బర్రెలు తినేవాడు వచ్చిందురా అనే పరిస్థితి రావచ్చు. అర్జంట్‌గా కిరణ్‌ను మార్చినందువల్ల అదనంగా వచ్చే ఉపయోగాలేవీ లేకపోవడంతో అధిష్టానం మార్పు ఆలోచనను దాదాపు విరమించుకున్నట్లుగానే కనిపిస్తుంది. అవినీతి ఆరోపణలకు దూరంగా వుంటూ మిస్టర్ క్లీన్ ఇమేజ్ తెచ్చుకోవడం ఆయన



- ప్రజాసమస్యల పరిష్కారంలో మాత్రం వైఫల్యం

స్థానాన్ని కాపాడిందనుకోవచ్చు. పార్టీలో ఆయన సక్సెస్ అయ్యారు. తన కేబినెట్‌లో సగం మంది మంత్రులు తనకు వ్యతిరేకంగా వున్నా కూడా తన సీటుకు ఎలాంటి ఢోకా లేకుండా చేసుకున్నారు. పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ నుండి ఎప్పటికప్పుడు ముప్పు పొంచివున్నా, సత్తిబాబు వేలితోనే ఆయన కన్ను పొడుస్తూ తనకు అడ్డు రాకుండా చేసుకున్నాడు.

పార్టీలో సక్సెస్ అయిన కిరణ్ పరిపాలనలో మాత్రం పూర్తిగా వైఫల్యం చెందుతున్నాడు. రాష్ట్రాన్ని చుట్టుముట్టిన సమస్యలను సున్నితంగా పరిష్కరించాల్సింది పోయి వాటిని మరింత పెద్దవి చేసుకుంటున్నాడు. రాష్ట్రంలో కరెంట్‌కోతలు, సర్‌ఛార్జీ వడ్డనలు వంటి వాటి పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో వున్నారు. ఇక సంక్షేమ పథకాలకు కోతలు, అభివృద్ధి (మిగతా 5వ పేజీలో)



## అంతరిక్ష వాణిజ్యంలో... ఇక హు'షార్'

> 7 ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టిన పిఎస్ఎల్‌వి-సి20

> ఆనంద క్షణాలను ఆస్వాదించిన రాష్ట్రపతి, గవర్నర్, సిఎం

అంతరిక్ష ప్రయోగాలలో అప్రతిహతంగా దూసుకుపోతున్న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)కు ఇది మరింత ఉత్సాహాన్నిచ్చే విజయం. అంతరిక్ష ప్రయోగాలలో అంతర్జాతీయంగా భారత్‌ను అగ్రభాగాన నిలపాలని శ్రమిస్తున్న శాస్త్రవేత్తల ఆశలను, ఆశయాలను ఆచరణలోకి తెచ్చే అద్భుతం... శాస్త్ర సాంకేతిక రంగాలలో భారత్ ఇక వెనకడుగు వేయబోదు అని చాటిచెప్పే చారిత్రాత్మక సందర్భం.
(మిగతా 5వ పేజీలో)

## అన్న జైలులో... చెల్లెలు జనంలో..

జగన్‌ను జనంలో వుంచిన షర్మిల పాదయాత్ర




మన రాజకీయాలలో సెంటిమెంట్ ఎంత బలంగా పనిచేస్తుందో అంత త్వరగా బలహీన పడుతుంది. సానుభూతి, సినిమా గ్లామర్ వంటివి ఏ నాయకుడినైనా ఒక్కసారికి మించి ఉపయోగపడవు. రాజకీయాలలో సానుభూతి తుఫాన్ లాంటిది. అప్పటికప్పుడు వచ్చి ఉధృతమవుతుంది. అంతే వేగంతో తగ్గిపోతుంది.

జగన్‌ను ఎక్కువకాలం జైలులో పెడితే జనం అతనిని మరచిపోతారని కాంగ్రెస్ అధిష్టానం ఆలోచన. జగన్ అదేపనిగా జనాల్లో తిరుగుతుంటే అతని పాపులారిటీ అంతకంతకు పెరుగుతుంది. అదే జైలులో వుంటే... కొద్ది రోజులకైనా జనం మరచిపోతారు. జగన్ పేరు వినపడకుండా చేస్తే చాలు.. రాజకీయాలలో ఆయన ప్రభావాన్ని చాలావరకు తగ్గించవచ్చు.

ఈ ఆలోచన సక్సెస్ అయ్యిండేదే! కాకపోతే ఎప్పుడు? జగన్ జైలుకు వెళ్లాక ఆయన చెల్లెలు షర్మిల పాదయాత్రను చేపట్టక పోయివుంటే! ఖచ్చితంగా జగన్ ప్రభావం కొంతన్నా తగ్గి వుండేది. నాయకత్వలేమితో వైయస్సార్ కాంగ్రెస్ (మిగతా 5వ పేజీలో)

వైద్య శిఖరానికి శుభాకాంక్షలు




తమిళనాట తెలుగు వెలుగులు ప్రసరిస్తూ... వైద్యరంగాన ఎవరెస్టులా నిలుస్తూ...
ఆపదలో వచ్చిన వారిని ఆదుకుంటూ... మంచికి, మానవతకు ప్రతిరూపంలా నిలిచిన
వైద్యశిరోమణి
డా॥ సి.యం.కె.రెడ్డి గారు
అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మద్రాసు యూనివర్శిటీ సిండికేట్ మెంబర్‌గా
బాధ్యతలు స్వీకరించిన శుభసందర్భంగా మా హృదయపూర్వక శుభాకాంక్షలు.
డా॥ వి.ఇందిర, ఎం.డి., రేడియాలజిస్ట్
ఇందిర స్కాన్ & ఎక్స్-రే సెంటర్
విజయమహల్‌గేటు దగ్గర, నెల్లూరు - 1. ఫోన్: 2328000, సెల్: 94409 17080.

PDF Compressor Free Version



ఓ పాతికేళ్ల క్రితం... పొదలకూరు, ఆత్మకూరు, వింజమూరు ప్రాంతాలలో అనుకుంటుండేవాళ్లు... త్వరలో మన ఊరికి రైలొస్తుందంట... రైలు లైన్లు వేయడానికి సర్వే కూడా చేసారట అని. పాతికేళ్ల తర్వాత కూడా ఆ ప్రాంతంలో ఇదే మాటలు వినిపిస్తున్నాయి. కాకపోతే ఇప్పుడు ఇంకో తరంవాళ్లు అనుకుంటున్నారు. ఇంకో పాతికేళ్ల తర్వాత కూడా ఆ ప్రాంతం వాళ్లు ఇలా మాట్లాడుకోక తప్పదేమో? ఎందుకంటే అక్కడ రైల్వేలైను వచ్చేది లేదు.. ఆ ప్రాంతంవాళ్లు రైలు ఎక్కేది లేదు.



# ఈ'సారీ' వినిపించని కూత

## రైల్వేబడ్జెట్‌లో నెల్లూరుకు కోత ● ప్రతి ఏటా ప్రతిపాదనలకే సరి

ప్రతి సంవత్సరం రైల్వేబడ్జెట్ వస్తుంది. రైల్వే బడ్జెట్ అన్నప్పుడల్లా వెంకటగిరి–నడికుడి రైల్వేలైను గుర్తొస్తుంది. మూడు దశాబ్దాలుగా ప్రతి రైల్వేబడ్జెట్ సమయంలో ఇది గుర్తుకు రాకమానదు. ఎప్పటికప్పుడు ఈ రైల్వేలైను అంచనాలకే పరిమితమవుతూ వస్తుంది. నెల్లూరుజిల్లా వెంకటగిరి నుండి గుంటూరు జిల్లా నడికుడి వరకు ఈ రైల్వేలైనును ప్రతిపాదించడం జరిగింది. దీని అంచనా వ్యయం ఎప్పటికప్పుడు పెరుగుతూ వచ్చింది. రైల్వేశాఖ జరిపిన సర్వేలో సైతం ఈ రైల్వేలైన్ మూలంగా ఆదాయమేగాని నష్టం లేదని తేలింది. మూడుజిల్లాల్లో దాదాపు 40 మండలాల ప్రజలకు ఈ రైల్వేలైన్ మూలంగా ఉపయోగం వుంటుంది. మన జిల్లాలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, పొదలకూరు, రాపూరు, చేజర్ల, ఆత్మకూరు, వింజమూరు, వరికుంటపాడు వంటి మండలాల ప్రజలకు ఈ రైలు మార్గం ఎంతగానో ఉపయోగపడుతుంది.

ముఖ్యంగా తుఫాన్‌లు, వరదల సమయంలో చెన్నై–విజయవాడల మధ్య రైల్వేలైన్ పలుచోట్ల దెబ్బతింటుంది. ఈ సమయంలో చాలారోజుల పాటు రైలు రవాణా స్థంభించిపోతుంది. ఇలాంటి సమయాలలో నడికుడి–వెంకటగిరి రైల్వే లైన్ ప్రత్యామ్నాయంగా కూడా ఉపయోగపడే అవకాశముంది. కాని కేంద్ర రైల్వేశాఖ మంత్రులు ఆదాయమొచ్చే ఈ రైలు మార్గం గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. వాళ్లు తమ సొంత పూర్లకు, తమ అత్తమామల పూర్లకు రైల్వేలైన్లు వేసుకోవడానికే ప్రాధాన్యతనిస్తుంటారు. కనీసం ఈ రైల్వేబడ్జెట్‌లోనైనా వెంకటగిరి–నడికుడి రైల్వేలైన్ ఆశలను పట్టాలెక్కిస్తారేమోనని చూసినవారికి నిరాశే మిగిలింది.

ఇక గూడూరు – దుగరాజపట్నం రైల్వేలైన్‌ను పనబాక లక్ష్మి ఎప్పుడో మంజూరు చేయించారు. కాని ఇంతవరకు పట్టాలు పడలేదు. ఇది కూడా గాలికి కొట్టుకుపోయినట్లే కనిపిస్తుంది.

బ్రిటీష్‌వారి కాలంలోనే బిట్రగుంట రైల్వేపరంగా ఓ వెలుగు వెలిగింది. ఇప్పుడు మాత్రం అక్కడ పాతవైభవానికి శిధిలాలు సజీవసాక్ష్యాలుగా వున్నాయి. బిట్రగుంట లోకోషెడ్ గురించి పూసేలేదు. బిట్రగుంట కాంక్రీట్ స్లీపర్ కోచ్ నిర్మాణానికి గతంలో రైల్వేమంత్రిగా వున్న లాలూప్రసాద్ యాదవ్ చేత శంకుస్థాపన చేయించారు. ఆ శంకుస్థాపనరాయి కూడా శిథిలమైపోయింది. బిట్రగుంటలో ఎటువంటి అభివృద్ధి లేకుండా పోయింది. నెల్లూరు రైల్వేస్టేషన్‌లో ముఖ్యమైన సూపర్‌ఫాస్ట్ రైళ్లకు స్టాపింగ్ అనేది పత్రికా ప్రకటనలకే పరిమితమైంది. నెల్లూరు–తిరుపతిల మధ్య మెమూరైళ్ల ప్రతిపాదన పట్టాలెక్కలేకపోయింది.

ఈ బడ్జెట్ వల్ల జిల్లాకు ఏదన్నా ఒరిగిందంటే అది కృష్ణపట్నం – నిడిగుంటపాలెం రైల్వేలైన్‌ను డబ్లింగ్ చేస్తామని రైల్వేమంత్రి ప్రకటించడమే!

జిల్లాలో తల పండిన రాజకీయ మేధావులు, ఎంపీలు వున్నారు. కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, వెంకయ్యనాయుడు, తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, చింతా మోహన్, మాగుంట శ్రీనివాసులురెడ్డి, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, లగడపాటి రాజగోపాల్, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి... అందరూ నెల్లూరోళ్లే. అందరూ ఉద్దండులే! వీళ్లంతా గట్టిగా ప్రయత్నించి వుంటే ఈ రైల్వే బడ్జెట్‌లో నెల్లూరుజిల్లాకు కొన్ని అభివృద్ధి పనులన్నా మంజూరయ్యేవేమో?

---

## కాలధర్మం - గండవరం సేతురామిరెడ్డి

# అ'సామాన్యుడు' కన్నుమూసాడు



సాధారణ రైతు కుటుంబంలో పుట్టాడు... సామాన్యుడిగా పెరిగాడు. సాధారణ జీవితం గడిపాడు. సామాన్యులతోనే కలిసి నడిచాడు. సామాన్యుల సమస్యలపైనే జీవితాంతం పోరాడాడు. చివరకు సామాన్యుడిగానే కన్ను మూసాడు. సామాన్యుడిగా జీవితాన్ని మొదలుపెట్టి అసామాన్యుడిగా ఎదిగి ఎందరికో ఆదర్శప్రాయుడిగా మారిన కమ్యూనిష్టు యోధుడు గండవరం సేతురామిరెడ్డి(84) ఫిబ్రవరి 24వ తేదీన కన్నుమూసారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లో తన మేనల్లుడు శాంతా బయోటెక్స్ అధినేత ఐ.వరప్రసాద్‌రెడ్డి ఇంట్లో వుంటూ తుదిశ్వాస విడిచారు. 1929 ఫిబ్రవరి 1వ తేదీన ఆయన జన్మించారు. విద్యార్థి దశలోనే ఆయన కమ్యూనిష్టు భావాలవైపు ఆకర్షితులయ్యారు. 1955లో రాజకీయాలలోకి ప్రవేశించి ఐదు పర్యాయాల పాటు మున్సిపల్ కౌన్సిలర్‌గా గెలిచారు. ఇప్పట్లో ఒక్క పర్యాయం కార్పొరేటర్‌గా గెలిచినవాళ్లే కోట్లకు పడగలెత్తుతుంటే, ఐదు సార్లు కౌన్సిలర్‌గా పనిచేసినా ఒక్క రూపాయి ఆయన అక్రమంగా సంపాదించలేదు. మనిషిలో అంత నిజాయితీ వుండేది.

మనకు కమ్యూనిష్టుయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య పార్లమెంటుకు సైకిల్‌మీద వెళ్లేవాడని తెలుసు. కాని సేతురామిరెడ్డి నెల్లూరులో అందరికీ సైకిల్ మీదనే కనిపించేవాడు. రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టిన దగ్గర్నుండి సైకిల్‌నే తన వాహనంగా ఎంచుకున్నాడు. ఒకే సైకిల్‌ను 60ఏళ్లపాటు తొక్కాడు. నెల్లూరులో ఆయన తొక్కిన సైకిల్‌కు సైతం అభిమానులు సన్మానకార్యక్రమం నిర్వహించారు. తన వద్దకొచ్చే ప్రజల సమస్యల కోసం ఆయనే స్వయంగా సైకిల్ తొక్కుకుంటూ కలెక్టర్ కార్యాలయం, ఎమ్మార్వో ఆఫీసు, డిఇఓ ఆఫీసు, ఎంపిడిఓ, వ్యవసాయశాఖ కార్యాలయం... ఇలా ఒకటేమిటి, అన్ని ప్రభుత్వ ఆఫీసులను చుట్టేసేవాడు. నగరంలో కార్మిక, కర్షక, పౌర సంఘాలను నెలకొల్పారు. ముఖ్యంగా నవాబుపేట, బంగ్లాతోట, స్టోన్‌హౌస్‌పేట, కుసుమహరిజనవాడ ప్రజలతో ఆయనకు సాన్నిహిత్యం ఎక్కువ. ఈ అజన్మాంత బ్రహ్మచారిని ఈ ప్రాంతప్రజలు తమ కుటుంబంలో ఒకడిగా భావించేవాళ్లు. ఏ.సి. సుబ్బారెడ్డి, స్వర్ణా వేమయ్య, రామకోటయ్య, గుజ్జుల యల్లమందారెడ్డి, గునుపాటి రామచంద్రయ్య, ఆచార్య పి.సి.రెడ్డి, డాక్టర్ బేర్, వేములపాటి అనంతరామయ్య, డాక్టర్ పి.రామచంద్రారెడ్డి వంటి ప్రముఖులతో ఎన్నో విషయాలపై కలిసి ఆయన పనిచేసారు. నీతినిజాయితీలనే తన ఆభరణాలుగా మలచుకున్న సేతురామిరెడ్డి చివరిదశలోనూ వాటిని వదలలేదు. ఆడంబరాలకు ఆయన దూరం. ఆదర్శవంతమైన జీవితానికి ఆయన నిదర్శనం. రాజకీయాల్లోనే కాదు వ్యక్తిగత జీవితంలోనూ విలువలు పాటించిన అతికొద్దిమంది నాయకుల్లో గండవరం సేతురామిరెడ్డి అగ్రస్థానంలో వుంటారంటే అతిశయోక్తి కాదు. నేటి తరాలకేకాదు, భావితరాలకు కూడా ఆయన స్ఫూర్తిప్రదాత. రైతు బాంధవా నీకు జోహార్లు...!

---

# విజ్ఞానాలయం... కస్తూరిదేవి విద్యాలయం



సంగీత విద్వాంసురాలు జె.బాలార్కను సన్మానిస్తున్న జె.వి.రెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యం

విద్యార్థులను బహుముఖ ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దే దేవాలయం కస్తూరిదేవి విద్యాలయమని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం కొనియాడారు. ఫిబ్రవరి 23న నెల్లూరు నగరంలోని కస్తూరిదేవి విద్యాలయం వార్షికోత్సవంలో విఠపు బాలసుబ్రహ్మణ్యం పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీరుతో ఎయిడెడ్ విద్యాసంస్థలు దీనావస్థలో ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు లేక అనేక పాఠశాలలు మూతపడుతున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కస్తూరిదేవి ఉన్నత పాఠశాల ఎందరో పేద విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం కల్పిస్తోందన్నారు. కస్తూరిదేవి విద్యాసంస్థల కరస్పాండెంట్ జెవిరెడ్డి మాట్లాడుతూ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో తమ స్కూలు ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. పాఠశాల అభివృద్ధికి కమిటీ మరింత విస్తృతంగా పనిచేస్తోందన్నారు. అనంతరం విద్యార్థినులు పాఠశాల చరిత్రను బుర్రకథతో వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. సంగీత ఉపాధ్యాయురాలు దేవసేన కచేరి వీనులవిందుగా సాగింది.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వనజ, కమిటీసభ్యుడు తుంగా శివప్రసాదరెడ్డి, రిటైర్డ్ ఇంజనీరు కమల, గాయని బాలార్క తదితరులు పాల్గొన్నారు.

---

# ఆహా... ఏమి రుచి.. అన్నారు మైమరచి!

## 'మాడరన్ స్కూల్' పాట్‌లక్ పార్టీలో గెస్టుల టేస్టులు



వివిధ వంటకాలను రుచిచూస్తున్న ఎమ్మెల్యే ముంగమూరు, పక్కన కరస్పాండెంట్ విజయకుమార్‌రెడ్డి

అలనాటి ప్రాచీన వంటకాలు, పౌష్టికాహార వంటకాలు దాదాపు 400కిపైగా వంటకాలను ప్రదర్శనలో ఉంచారు. నెల్లూరులోని సరస్వతినగర్ మాడరన్ స్కూలులో గతనెల 21వతేది విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు కలసి పాఠశాల ఆవరణంలో "పాట్‌లక్‌పార్టీ" వేడుకను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. మరీ ముఖ్యంగా ఈతరం వారికి తెలియని వంటకాలను లొట్టలేస్తూ విద్యార్థినీ, విద్యార్థులు ఆస్వాదించి మైమరిచారు. ఈ పార్టీకి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల తల్లులు తయారుచేసిన అలనాటి వంటకాలను అందరూ కలసి తినడం, ఆయా వంటకాల వివరాలను ఒకరినొకరు తెలుసుకోవడం, పరిచయాలు పెంచుకోవడానికి ఈ పాట్‌లక్‌పార్టీ మంచి వేదికన్నారు. ఈ కార్యక్రమంలో మాడరన్ స్కూలు కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, హైదరాబాద్ డిపిఆర్‌ఓ ప్రసాద్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు నేతాజీ సుబ్బారెడ్డి, సంఘమిత్ర రవీంద్రరెడ్డి, శారదా శ్రీనివాసులు, మాడరన్‌స్కూలు డైరెక్టర్ బిఎల్‌వి సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






జగనొస్తేగాని వర్గపోరు సర్దుకోదు

# ఎవరి దారి వారిదే!





జిల్లా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో ఎవరిలోకం వారిదే, ఎవరి దారివారిదే అన్నట్లు పరిస్థితులు మారి పోయాయి. వీళ్లకు చెప్పేవాళ్లు లేకపోవడంతో, చెప్పినా వినిపించుకునే స్థాయిని దాటిపోవడంతో గొడవలు హద్దుమీరి వీరవిజృంభణ చేస్తున్నాయి. జగన్ బయటకు రానిదే, ఆయన పిలిచి మందలించనిదే ఇక్కడ నాయకులు ఒకదారిలో నడిచేటట్లు లేదు.

వైకాపాలో పాదయాత్రల జోరు... వర్గాలపోరు తీవ్రమైంది. ఆయా నియోజకవర్గాల నుండి సీట్లను ఆశిస్తున్న వాళ్లు ముందుజాగ్రత్తగా పాదయాత్రలు పెట్టుకున్నారు. నెల్లూరు జంట నియోజకవర్గాలు, సర్వేపల్లి, కావలిలలో పాదయాత్రల పరంపర చూస్తున్నాము. వెంకటగిరి ఇన్‌ఛార్జ్‌గా కొమ్మి లక్ష్మయ్యనాయుడిని నియమించారు. ఈ మధ్య వెంకటగిరిలో జరిగిన సభలో... కొమ్మి లక్ష్మయ్య ప్రస్తుతానికి వెంకటగిరి నియోజకవర్గానికి ఇన్‌ఛార్జేగాని, రేపు టిక్కెట్ ఎవరికి వస్తుందో చెప్పలేమంటూ మేకపాటి రాజమోహన్‌రెడ్డి షాక్ ఇచ్చాడు. దీంతో కొమ్మి వెంకటగిరిలో పాతుకుపోవాలనే దిశగా పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.


ఆనంవాళ్ల లాగా రాజకీయాల గురించి పూర్తిగా తెలియకపోయినా అంతా మాకే తెలుసు అన్నట్లుగా మేకపాటి సోదరులు చేస్తున్న రాజకీయాలకు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గందరగోళంగా తయారైంది. జగన్ పార్టీ పెట్టినప్పుడు ముందుగా పార్టీలో చేరినవారికి గ్యారంటీ లేకుండాపోయింది. జగన్ మా మాట జవదాటడు అనే అతివిశ్వాసంతో మేకపాటి సోదరులు చేస్తున్న ఆగడాలకు పార్టీ కేడర్ కకావికలమవుతుంది. జగన్ బయట కొచ్చాకైనా వీరి 'దూకుడు'కు కళ్లెం వేయకపోతే పార్టీ బాగుపడదు.

## సెంటిమెంట్ పదవులు




జిల్లా కేంద్ర సహకారబ్యాంకు ఛైర్మన్, జిల్లా సహకార మార్కెటింగ్ ఛైర్మన్... ఈ రెండూ సెంటిమెంట్ పదవులే! జిల్లాలో చాలామంది ప్రముఖ నాయకులు ఈ పదవుల నుండే తమ ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. ఆనం రామనారాయణరెడ్డి తొలుత జిల్లా మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్‌గా పని చేయడం తెలిసిందే. ఇక సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం వివేకానంద రెడ్డి వంటివాళ్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్‌గా పనిచేసారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ అయిన మెట్టుకూరు ధనుంజయరెడ్డి, జిల్లా కేంద్ర సహకార మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ అయిన సుమంత్‌రెడ్డిలకు కూడా ఈ సెంటిమెంట్ వర్తిస్తుందేమో చూడాలి.

## భాగ్యనగరంలో బాంబు పేలుళ్ళు...
# నెల్లూరులో దాని చప్పుళ్ళు!



* హైదరాబాద్ బాంబు పేలుళ్ళకు నెల్లూరుజైలు ఖైదీతో లింకు..?
* జీవితఖైదీ ఫిరోజ్‌ఖాన్‌ను కలిసిన మక్బూల్

హైదరాబాద్ బాంబు పేలుళ్ళకు నెల్లూరు కేంద్రకారాగారంలోని ఖైదీతో లింకు ఉన్నట్లు తెలుస్తోంది. వరుస బాంబు పేలుళ్ళ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న మక్బూల్‌కు నెల్లూరు కేంద్ర కారాగారంలో అత్యంత భద్రత వున్న ఇద్దరు ఖైదీలతో సన్నిహిత సంబంధాలున్నట్లు పోలీసులు గుర్తించారు. ఫిరోజ్‌ఖాన్(35) అబిద్‌హుస్సేన్ వివిధ కేసుల్లో రిమాండ్ ఖైదీలు. వీరు 2011 సంవత్సరం నుండి నెల్లూరు జైలులో ఉన్నారు. ఫిరోజ్‌ఖాన్‌ను మక్బూల్ గత ఏడాది జనవరి 4వతేదీన ములాఖత్‌లో కలసి దాదాపు 40నిమిషాల పాటు మాట్లాడినట్లు సమాచారం. ఈ ములాఖత్‌లో హైదరాబాదు నరమేధాన్ని గురించి చర్చించుకుని ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. బాంబుపేలుళ్ళలో నిందితునిగా భావిస్తున్న మక్బూల్, ఫిరోజ్, అబిద్‌లు చర్లపల్లి జైల్లో సన్నిహి తులుగా ఉన్నట్లు ఇంటలిజెన్స్ పోలీసులు అనుమానిస్తున్నారు. హైదరాబాద్ బాంబు పేలుళ్ళ కేసులో మక్బూల్ పాత్రను గట్టిగా విశ్వసిస్తున్న పోలీసులు నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న ఫిరోజ్‌ఖాన్‌ను విచారిస్తే ఏదైనా సమాచారం రాబట్టవచ్చని భావిస్తున్నారు. దీనికి కారణం ఫిరోజ్‌ఖాన్, మక్బూల్‌లు నిజామాబాద్ జిల్లా వాసులు కావడమే.

**ఓటరు ఐడి కార్డుతో ములాఖత్...**

నెల్లూరు కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు శిక్షను (మిగతా 5వ పేజీలో)



PDF Compressor Free Version




## 'ప్రభా'తం

ఉగ్రవాదుల గురించి ముందే సమాచారం వుంది. అన్ని రాష్ట్రాలను ఈ దిశగా హెచ్చరించాం... అయితే దాడులు ఎక్కడ జరుగుతాయోనన్నది మాత్రం ఖచ్చితంగా చెప్పలేకపోయాం... హైదరాబాద్‌లో సంభవించిన జంట బాంబుపేలుళ్ల తర్వాత కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్‌షిండే చేసిన వ్యాఖ్యలివి. భారత్ లాంటి దేశంలో తీవ్రవాద దాడుల హెచ్చరిక ఒక రోజుకో, ఒక నెలకో, ఒక ఏడాదికో పరిమితం కాదు. ప్రతిరోజూ అప్రమత్తంగా వుండాల్సిందే! తీవ్రవాద దాడుల సమాచారం వచ్చిందని పోలీసులు ఒకరోజు తుపాకులు పట్టుకుని తిరిగితేనో, ఒక రోజంతా వాహనాలను తనిఖీ చేస్తేనో సరిపోదు.

పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలకు భారతదేశంలో ముంబై తర్వాత హైదరాబాద్ నగరం ప్రధాన లక్ష్యంగా మారిపోయింది. దేశంలోనే ఉగ్రముప్పును ఎదుర్కొంటున్న ప్రధాననగరాలలో హైదరాబాద్ ఒకటి. దీనికి కారణం లేకపోలేదు. పాక్ నుండి దిగుమతి అయ్యే ఉగ్రవాదులు ఇక్కడ సాధారణ జనంలో కలిసిపోయే అవకాశాలు ఎక్కువ. మారణహోమం సృష్టించాక నిందితులు సాధారణ జనంలో కలిసి తప్పించుకుపోవడానికి కూడా అవకాశం ఎక్కువే! ఇక తెలియకుండానే అంతో ఇంతో ప్రేరేపిత ఉగ్రవాదులకు స్థానిక సహకారం సరేసరి!

భాగ్యనగరంలో నిత్యం రద్దీగా వుండే దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో జరిగిన జంట బాంబుపేలుళ్లు మన భద్రతా వ్యవస్థ పనితీరును ప్రశ్నిస్తున్నాయి. ఈ విస్ఫోటనంలో అక్కడికక్కడే 15మంది మృత్యువాత పడగా కళ్లు, కాళ్లు, చేతులు పోగొట్టుకున్న అభాగ్యులెందరో! ఉగ్రవాదులు ఎంతో పక్కాగా సైకిళ్లకు టిఫిన్‌బాంబులు అమర్చి రిమోట్‌కంట్రోల్ ద్వారా పేల్చారు. పేలుళ్ల తర్వాత యధాప్రకారంగా దర్యాప్తు బృందాలు రంగంలోకి దిగడం, వివిధ కోణాలలో విచారణలు మొదలుపెట్టడం షరామామూలుగా జరిగిపోతున్నాయి.



### 'ఉగ్ర'రూపం

దేశంలో భద్రతా వ్యవస్థ ఎంత అధ్వాన్నంగా వుందో హైదరాబాద్ బాంబుపేలుళ్లు నిరూపిస్తున్నాయి. పటిష్టమైన నిఘా కొరవడడమే కాదు... చాలా సులభంగా మన దేశంలోకి ఉగ్రవాదులు ప్రవేశించగలుగుతుండడంతో మారణహోమాలు, రక్తపాతాలకు హద్దు లేకుండా పోతుంది.

అమెరికాలో వరల్డ్‌ట్రేడ్ సెంటర్ టవర్స్‌ను కూల్చివేసిన తర్వాత ఇంత వరకు ఒక్క ఉగ్రవాద సంఘటన కూడా అక్కడ చోటుచేసుకోలేదు. దానికి కారణం డబ్ల్యూటిసి భవనాలను కూల్చడాన్ని ఆ దేశం అంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. తమ దేశంపై దాడి జరిపించిన అల్‌ఖైదా అధినేత బిన్‌లాడెన్‌ను వెదికివెదికి మట్టుబెట్టడమే కాదు, ఆ కసితో ఇంకా ఉగ్రవాద శిబిరాలపై దాడులు నిర్వహిస్తూనే వుంది. డబ్ల్యూటిసి భవనాల కూల్చివేత తర్వాత అమెరికాలో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసారు. విమానాశ్రయాలలో వివిపిలను సైతం బట్టలిప్పించి నిలువునా తనిఖీలు చేస్తున్నారు. ఆ దేశంలో ఎవరైనా పౌరులు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే పోలీసులు వెంటనే అరెస్ట్‌చేయడం, పాస్‌పోర్టులు తనిఖీచేసి, అవి లేకుంటే జైలుకు పంపడం చేస్తున్నారు. కాని మన దేశంలో ఉగ్రవాద దాడులు సర్వసాధారణమయ్యాయి. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి నిందితుడు లాడెన్‌ను అమెరికా పాకిస్థాన్‌లోకి పోయి కాల్చి చంపితే, ముంబైలో బాంబులు పెట్టి 200మందిని పొట్టనపెట్టుకున్న పరమకిరాతకుడు, మాఫియాడాన్ దావూద్ ఇబ్రహీం పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా విహరిస్తున్నా మనం ఏమీ చేయలేకపోతున్నాం. కనీసం అతడిని అరెస్ట్ చేసి ఇక్కడ కోర్టుల్లో నిలబెట్టే పరిస్థితి కూడా లేకుండాపోయింది. ముంబైదాడుల నిందితుడు కసబ్‌ను జైలులో పెట్టి 38కోట్లు ఖర్చుపెట్టి ఇటీవలనే తీరిగ్గా ఉరితీసారు. పార్లమెంట్‌పై దాడి కేసు నిందితుడు అఫ్జల్‌గురును కూడా పదేళ్ల తర్వాత ఉరికంబం ఎక్కించారు. దేశంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం మూలంగా జరిగిన ప్రాణనష్టం లక్షల్లోనే వుంటుంది. కాని ఉగ్రవాదులకు గాను తీవ్రశిక్షలు విధించింది కసబ్, అఫ్జల్‌గురులకే! వివిధ మారణ హోమాలలో పట్టుబడ్డ నిందితులను జైళ్లల్లో పెట్టి మేపుతున్నాం. ఇలా జైళ్లలో పెట్టబడ్డ మహ్మద్‌సయీద్ అనే ఉగ్రవాదిని విడిపించుకోవడం కోసం ఉగ్రవాదులు ఎన్డీఏ హయాంలో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్‌చేసి కాందహార్‌లో దించడం, తమ పంతం నెరవేర్చుకోవడం జరిగాయి. తీవ్రమైన రక్తపాతాలకు పాల్పడ్డ ఉగ్రవాదులను కూడా జైళ్లలో పెట్టి కొత్తగా వచ్చిన అల్లుళ్ల లాగా చూస్తుండడంతో దీనిని వాళ్లు అలుసుగా తీసుకుంటున్నారు. దీనివల్లే జైళ్లలో నుండే ఉగ్రదాడులకు ప్రణాళికలు రూపొందించే పరిస్థితి వచ్చింది.

పాక్‌ప్రేరేపిత ఉగ్రవాదం దేశంలో చాపక్రింద నీరులా చొచ్చుకు పోతుందన్నది పచ్చి వాస్తవం. స్థానిక సహకారం లేనిదే ఉగ్రవాద మూకలు ఇంత కిరాతక చర్యలకు తెగబడవు. పాక్ వైపు నుండి దురాక్రమణలు, బంగ్లాదేశ్ నుండి చొరబాట్లు ఎక్కువగా వుంటున్నాయి. వీటిని అరికట్టకపోతే దేశానికి మున్ముందు పెనుముప్పు ఖాయం. దేశంలో నెలకొన్న ఓటుబ్యాంకు రాజకీయాలు కూడా పరోక్షంగా ఉగ్రవాద చర్యలకు ఊతమిచ్చేలా వుంటున్నాయి. అక్రమంగా దేశంలో చొరబడ్డ వాళ్లు ఎంత ప్రమాదకరంగా మారుతున్నారన్నది ఇటీవల అస్సాంలో చోటుచేసుకున్న మతఘర్షణలను బట్టి తెలుసుకోవచ్చు. దేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వారికి ఓటు హక్కు ఇవ్వాలని, మన దేశ పౌరసత్వం ఇవ్వాలని కొన్ని రాజకీయపార్టీలు డిమాండ్ చేయడం ఆందోళన కలిగించే విషయం. వీళ్లు ఓట్ల కోసం దేశభద్రతను సైతం పణంగా పెట్టేందుకు తెగబడుతున్నారు.

దేశంలో మరో ఉగ్రదుశ్చర్య చోటుచేసుకోకుండా వుండాలంటే, సంఘటన జరిగాక దర్యాప్తు చేయడం కాదు, సంఘటనలు జరగకుండా చేసేందుకు తగు నిర్ణయాలు తీసుకోవాలి. దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి వారిని తరిమేయాలి. దేశంలో పౌరులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, ప్రతిరోజూ పోలీసు తనిఖీలను పెంచాలి. కులమతాలకు అతీతంగా పోలీసులు ఏ ప్రాంతంలోనైనా వెళ్లి తనిఖీలు చేపట్టాలి. అనుమానమొస్తే ఎవరినైనా తనిఖీ చేసేటట్లుండాలి.

ఉగ్రవాదులకు స్థానికంగా అందుతున్న సహకారం లింకులను కత్తిరించాలి. ఇలా పలు కోణాలలో నిర్దిష్టమైన చర్యలు తీసుకోనిదే ఉగ్రవాద దాడులకు ముకుతాడు వేయడం కష్టం.

## 'అంతర్'జాతీయం

- సేతు సముద్రం ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలపై ఆర్‌కె పచౌరి కమిటీ చేసిన సూచనల్ని కేంద్రం తిరస్కరించింది. సేతు సముద్రం ప్రాజెక్ట్ సరికాదని పచౌరి కమిటీ తేల్చిచెప్పింది. జాతీయ ప్రయోజనాల కోసం ఈ కమిటీ నివేదికను తిరస్కరిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.
- హైదరాబాద్ జంట పేలుళ్ల వెనుక పాకిస్థాన్ ప్రమేయముందని బీజేపీ అగ్రనేత ఎల్.కె.అద్వానీ ఆరోపించారు.
- ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని అజ్మీర్ దర్గా దివాన్ పేర్కొన్నారు. హైదరాబాద్ పేలుళ్లను ఆయన ఖండిస్తూ ఇస్లాం ఎప్పుడూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహించదన్నారు.
- మయన్మార్‌కు 15కోట్లు విలువచేసే మాదకద్రవ్యాలను అక్రమంగా తరలిస్తున్న రక్షణశాఖ పిఆర్‌ఓ కల్నల్ అజయ్‌చౌదరిని మణిపూర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.
- దక్షిణ కొరియా ప్రథమమహిళా అధ్యక్షురాలిగా పప్‌గున్‌హే సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దాదాపు 70వేలమంది ప్రజల సమక్షంలో ఆమె ప్రమాణస్వీకారం చేసారు.
- క్యూబా అధ్యక్షుడిగా రౌల్‌కాస్ట్రో రెండోసారి ఎన్నికయ్యారు. 2006లో కమ్యూనిష్టు విప్లవయోధుడు ఫిడేల్ కాస్ట్రో జబ్బునపడడంతో రౌల్‌కాస్ట్రో ఆయన నుండి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు.
- భారతీయ కథా నేపథ్యంలో రూపొందించిన 'లైఫ్ ఆఫ్ పై'కు నాలుగు ఆస్కార్ అవార్డులు దక్కాయి. సోమవారం లాస్‌ఏంజిల్స్‌లో జరిగిన 85వ ఆస్కార్ అవార్డు వేడుకలలో ఈ సినిమా టీం అవార్డులను స్వీకరించింది.
- భారత్ - ఆస్ట్రేలియాల మధ్య జరుగుతున్న టెస్ట్‌సిరీస్‌లో భాగంగా చెన్నైలో జరిగిన తొలి టెస్ట్‌లో భారత్ 8వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో డబుల్‌సెంచరీ సాధించిన కెప్టెన్ ధోనీకి మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ విజయంతో టెస్టుల్లో అత్యధిక విజయాలు అందించిన కెప్టెన్‌గా ధోని గతంలో గంగూలి పేరిట వున్న రికార్డును సమం చేశాడు.

## వార్త వ్యాఖ్య

వార్త :- హైదరాబాద్ పేలుళ్ల దుండగులను త్వరలోనే పట్టుకుంటాం.
- షిండే.

**వ్యాఖ్య :- పట్టుకుని జైలులో పెట్టి మేపుతారు... అంతేగా!**

వార్త :- కాంగ్రెస్‌ను నమ్మే మీకీ కష్టాలు.
- పాదయాత్రలో ప్రజలనుద్దేశించి చంద్రబాబు.

**వ్యాఖ్య :- ఇంకా కష్టాలు పెడతారనే మిమ్మల్ని నమ్మడం లేదు.**

వార్త :- ఉగ్రవాదులను బహిరంగంగా ఉరితీయాలి. - మంత్రి టీజీ.

**వ్యాఖ్య :- రహస్యంగా ఉరితీయాలంటేనే ఏళ్లు పడుతుంది.. ఇక బహిరంగంగా అంటే దశాబ్దాలే!**

వార్త :- ఎన్నికల్లో పోటీకి యువత ముందుండాలి. - జేపీ.

**వ్యాఖ్య :- యువతలో కూడా రౌడీలు, రేపిస్టులూ ముందుంటున్నారు.**

వార్త :- నిఘా హెచ్చరికల్ని తేలిగ్గా తీసుకోలేదు.
- హైదరాబాద్ సిపి అనురాగ్‌శర్మ.

**వ్యాఖ్య :- సీరియస్‌గానే వదివారా!**

వార్త :- హైదరాబాద్‌లో ఇంటింటినీ గాలించాలి. - బీజేపీ నేత వెంకయ్య.

**వ్యాఖ్య :- ముందు ప్రతి ఇంటివాళ్లు కరెంట్‌బిల్లులు కట్టేలా చూడండి.**

వార్త :- పేలుళ్లపై అంతర్జాతీయ చర్చ జరగాలి. - కేసీఆర్.


**వ్యాఖ్య :- చాలాకాలం తర్వాత మీ నోటి నుండి ఒక సమస్యపై స్పందన వచ్చింది.**

వార్త :- బాబు జేజమ్మ వచ్చినా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేరు. - బొత్స.

**వ్యాఖ్య :- ఏదన్నా చేయాలంటే మీరే చేస్తారుగా, ఆ ఛాన్స్ వాళ్లకెందుకిస్తారు.**

వార్త :- దమ్ముంటే చంద్రబాబును అరెస్ట్ చేయండి.
- దేశం ఎమ్మెల్సీ వైవిబి రాజేంద్రప్రసాద్.

**వ్యాఖ్య :- మీ వాలకం చూస్తుంటే ఆయన అరెస్ట్ కోసం ఆశగా ఎదురు చూస్తున్నట్లుగా వుంది.**




### దేశద్రోహులను ఉరితీయాలి

ఈ దేశంలో వుంటూ, ఇక్కడి తిండితింటూ చాలామంది దేశద్రోహానికి పాల్పడుతున్నారు. ఇలాంటి వాళ్లే శత్రుదేశ ఉగ్రవాదులకు సాయపడుతున్నారు. తిండి పెడుతున్న భారతదేశం పట్ల విశ్వాసం చూపకుండా మన శత్రుదేశమైన పాకిస్థాన్‌పై అభిమానం చూపిస్తున్నారు. క్రికెట్‌లో మన జట్టు మీద పాకిస్థాన్ గెలిస్తే ఆనందంతో టపాసులు కాలుస్తున్నారు. ఇలాంటి దేశద్రోహులను నిలువునా కాల్చి చంపాలి.

సి.రాజీవి, నెల్లూరు.

### హైదరాబాద్‌ను... నాశనం చేస్తున్నారు

ఓపక్క ఉగ్రవాదులు, మరోపక్క కేసీఆర్ లాంటి వేర్పాటువాదులు కలిసి హైదరాబాద్‌ను నాశనం చేస్తున్నారు. చెన్నై, బెంగుళూరు, జైపూర్, కలకత్తా, ముంబై వంటి నగరాలకంటే మన హైదరాబాద్ ఎంతో అందంగా వుంటుంది. కాసు బ్రహ్మానందరెడ్డి, ఎన్టీఆర్, చంద్రబాబు, వై.యస్.రాజశేఖరరెడ్డిలు హైదరాబాద్‌ను ఎంతగానో అభివృద్ధి చేసారు. తీవ్రవాద జాడలు లేకుంటే హైదరాబాద్ ఇంకా ఎంతో అందంగా తయారవుతుంది. కేసీఆర్ ప్రాంతీయతత్వాన్ని రెచ్చగొట్టకుండా వుంటే హైదరాబాద్ దేశంలోనే ఆదర్శవంతమైన నగరమవుతుంది.

తూమాటి నాగిరెడ్డి,
హైదరాబాద్.

### కఠినశిక్షలు కావాలి

ఉగ్రవాదచర్యలకు పాల్పడే వారికి, స్త్రీలపై అత్యాచారాలకు పాల్పడి హత్యలు చేసేవారికి, పసిపిల్లలను కిడ్నాప్‌చేసి డబ్బుల కోసం చంపేవాళ్లకి, కిరాయి హత్యలు చేసేవాళ్లకు కఠినశిక్షలు అమలు చేయాలి. నిందితులను వెనువెంటనే ఎన్‌కౌంటర్ చేయాలి. నేరతీవ్రతను బట్టి నిందితులకు అప్పటికప్పుడు శిక్షలు విధించాలి. ఇటీవల కాలంలో అత్యాచారాలు చేసి ఆపై హత్యలు చేసిన నిందితులకు పలు కోర్టులు ఉరిశిక్షను విధించడం పత్రికల్లో చూస్తున్నాం. క్షమాభిక్షకు అవకాశం లేకుండా ఈ శిక్షలను అమలు చేయాలి.

జి.వి.నగేష్, పామూరు.

PDF Compressor Free Version



# రసరమ్యంగా పద్యనాటక పోటీలు



పెళ్కూరు పట్టాభిరామిరెడ్డి స్మారకట్రస్టు పంచమ వార్షి కోత్సవం సందర్భంగా నెల్లూరు టౌనుహాలులో మంగళవారం నుండి రాష్ట్రస్థాయి ఆహ్వాన పద్యనాటక పోటీలు ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా మేనేజింగ్ ట్రస్టీ పెళ్కూరు సుధాకర్‌రెడ్డి, డిసిసిబీ మాజీ అధ్యక్షుడు వేమారెడ్డి శ్యామసుందరరెడ్డి, ట్రస్ట్ కన్వీనర్ వల్లకవి వెంకట సుబ్బారావు, ఆచార్య ఆదిత్యలు జ్యోతి ప్రకాశనంగావించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఆశయాల మేరకు పద్యనాటక పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కళలను ప్రోత్సహించేందుకు ఏకపాత్రాభినయం, సంగీతం, నృత్యాలు, పద్యగాన, విచిత్ర వేషధారణ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పద్యనాటక పోటీలలో తిరుపతి వెంకట నటరాజ నాటక కళామండలి వారి దీపావళి నాటక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పద్యనాటకోత్సవాల్లో భాగంగా రెండవరోజైన బుధవారం హైదరాబాద్ వనస్థలిపురానికి చెందిన శ్రీ కళామయి పరిషత్ వారి కుచేలోపాఖ్యానం అందరిని అలరించింది. అనంతరం నెల్లూరు రామప్రసాద కళానిలయం పరిషత్ వారి శ్రీకృష్ణ పారిజాతం నాటకం ఆద్యంతం రసరమ్యంగా సాగింది. ఈ పోటీలను ట్రస్టు కన్వీనర్ వల్లకవి వేంకటసుబ్బారావు పర్యవేక్షించారు. న్యాయనిర్ణేతలుగా టివి రమణారావు, టి.రామచంద్రయ్య, సి.లక్ష్మీకాంతశర్మలు వ్యవహరించారు. ఈ పోటీలను సింహపురి కళాకారులు, కళాభిమానులు, కళాపోషకులు, నగరప్రముఖులు అధికసంఖ్యలో విచ్చేసి తిలకించారు.

# 3 నుండి 219వ జ్ఞాన యజ్ఞం



నెల్లూరులోని విఆర్ కళాశాల మైదానంలో ఈనెల 3వతేదీ నుండి 10వతేదీ వరకు శ్రీ స్వామి సుందర చైతన్యానందుల వారి అమృతోపన్యాసములో 219వ జ్ఞాన యజ్ఞములు ప్రతిరోజు సాయంత్రం 6.30గంటల నుండి 8గంటల వరకు జరుగుతుందని సుందర సత్సంగ్ సభ్యులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6గంటల నుండి 7గంటల వరకు శ్రీ విద్యారణ్యస్వామి విరచితం వేదాంత పంచదశి మహావాక్య ప్రకరణము జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు వేలాదిగా పాల్గొనాలని కోరారు.

# పాలనలో ఫ్లాప్

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమాల ఆపుదల, పెరిగిన ధరలు, పెరగని ఆదాయం వంటివి ప్రజలలో ఆగ్రహాన్ని రేకెత్తిస్తున్నాయి. కిరణ్ సీఎం అయ్యాక రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. తెలంగాణ సమస్య ఓ పక్క రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దారుణంగా దెబ్బతీస్తే, కిరణ్ అనుసరించిన ఆర్థిక విధానాలు ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసాయి. కిరణ్ సీఎం కుర్చీ ఎక్కినప్పటి నుండి ఆ సీటును కాపాడుకోవడానికే ఎక్కువ సమయం వెచ్చించాల్సి వచ్చింది. పరిపాలన మీద దృష్టి పెట్టడం తక్కువయ్యింది. కుర్చీని కాపాడుకునే ప్రయత్నంలో ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడానికే పుణ్యకాలం కాస్తా సరిపోయింది. అంతర్గత రాజకీయాల మీద దృష్టి పెట్టడం, జగన్ మీద కక్షతో కేసులు పెట్టి వేధించడం వంటి కార్యక్రమాలతోనే ఆయన పాలనాకాలం కాస్తా గడిచిపోయింది. కిరణ్ హయాంలో ఆయన బ్రాండ్ అని చెప్పుకోదగ్గ అభివృద్ధి కార్యక్రమం ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు సరికదా దివంగతనేత వై.యస్. హయాంలో చేపట్టిన ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కిరణ్ హయాంలో మంగళంపాడే పరిస్థితి వచ్చింది. పన్నులు, ఛార్జీలు వంటివి పెరగడం, వ్యాపార, వాణిజ్య, వ్యవసాయం కార్యకలాపాలు పూర్తిగా స్థంభించడంతో రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం గణనీయంగా పడిపోయి బ్రతుకులే భారంగా మారాయి. వై.యస్. హయాంలో ఆర్థికవృద్ధి రేటు గుజరాత్‌తో పోటీ పడగా తాజా ఆర్థిక సర్వే తేల్చిన లెక్కల ప్రకారం 11వ స్థానంలో నిలిచాం. వెనుకబాటు తనానికి ప్రతిరూపంలా నిలిచే బీహార్ వృద్ధిరేటులో ప్రథమస్థానంలో నిలవగా మనం మాత్రం మధ్యప్రదేశ్ కంటే వెనుకబడి పోయాము.

ఆర్థికాభివృద్ధిలోనే కాదు శాంతిభద్రతల విషయంలోనూ కిరణ్ వైఫల్యానికి నిదర్శనం హైదరాబాద్‌లో సంభవించిన జంటపేలుళ్ళు. కిడ్నాప్‌లు, హత్యలు, ఆర్థికనేరాలలో సైతం ఆంధ్రప్రదేశ్ వేగంగా దూసుకుపోతుంది. పోలీసువ్యవస్థను పటిష్టం చేయకపోవడం, పోలీసు వ్యవస్థపై రాజకీయ ఒత్తిళ్ల మూలంగా శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలుగుతుంది.

కిరణ్ రోజురోజుకు పార్టీలో ఎదుగుతున్నాడు. కాని పరిపాలనలో ఆ ఎదుగుదల లేదు. ప్రజలను పార్టీవైపు మళ్లించేంత పరిపాలనానుభవం ఆయనకు లేకుండా పోతుంది.

# హు 'షార్'

(మొదటిపేజీ తరువాయి)

ఒక స్వదేశీ, ఆరు విదేశీ... వెరసి మొత్తం ఏడు ఉపగ్రహాలను తన కడుపులో దాచుకుని ఎంతో జాగ్రత్తగా వాటిని నిర్దేశిత కక్షలో వదిలింది పిఎస్ఎల్‌వి-సి20. పిఎస్ఎల్‌వి... ఈ సిరీస్ ఇస్రో శాస్త్రవేత్తల నమ్మకానికి అమ్మ లాంటిది. పిఎస్ఎల్‌వి రాకెట్లను నమ్మినంతగా ఇస్రో శాస్త్రవేత్తలు తమ నీడను కూడా నమ్మరు. ఎందుకంటే పిఎస్ఎల్‌వి ఎప్పుడు కూడా వారి నమ్మకాన్ని వమ్ము చేయలేదు. అంతరిక్ష అంతర్జాతీయ వేదికలపై వారి ఆశలను ఆకాశమంత ఎత్తుకు మోసుకెళ్తానే వుంది.

భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, రాష్ట్ర గవర్నర్ నరసింహన్, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇస్రో ఛైర్మన్ రాధాకృష్ణన్, రాష్ట్ర మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి... ఇంకా ఎందరో ప్రముఖులు మిషన్‌కంట్రోల్ రూంలో... మీడియా ప్రతినిధులు, అధికారులు, షార్‌లో వుంటున్న స్థానికులు అక్కడి భవనాలెక్కి.. సూళ్లూరుపేట, తడ, డి.వి. సత్రం, ఓజిలి, చిల్లకూరు మండలాలలో లక్షలాది మంది ప్రజలు మిద్దెలెక్కి... కోట్లాదిమంది భారతీయులు టీవీలలో ఎంతో ఆసక్తిగా చూస్తుండగా ఫిబ్రవరి 25వ తేదీ సోమవారం సాయంత్రం 6 గంటలా 1నిముషాలకు నింగిని చీల్చుకుంటూ నారింజ మంటలు విరజిమ్ముకుంటూ అంతరిక్షంకేసి దూసుకుపోయింది పిఎస్ఎల్‌వి-సి20. మన తెలుగువాడు, మొగల్తూరు మొనగాడు ఎం.వై.ఎస్.ప్రసాద్ షార్ డైరెక్టర్ అయ్యాక జరిగిన తొలి ప్రయోగమిది. షార్ డైరక్టర్‌గా ఆయన ప్రస్థానం పిఎస్ఎల్‌వి-సి20 ఘన విజయంతో ప్రారంభమైంది.

**సెంటిమెంట్ సిరీస్...** పిఎస్ఎల్‌వి సిరీస్‌లో మొదటి ప్రయోగం తప్పితే మిగతా 22ప్రయోగాలు విజయవంతం కావడం విశేషం.

మొత్తం 18నిముషాల వ్యవధిలో ప్రయోగం విజయవంతమైంది. భారత్, ఫ్రాన్స్‌లు సంయుక్తంగా తయారుచేసిన 409కిలోల బరువుగల 'సరళ్' ఉపగ్రహంతో పాటు కెనడాకు చెందిన 148 కిలోల బరువు గల 'సఫైర్', 74కిలోల బరువుగల 'నియోశాట్', ఆస్ట్రియా దేశానికి చెందిన ఒక్కొక్కటి 14కిలోల బరువు కలిగిన బ్రైట్, యూనీబ్రైట్, డెన్మార్క్‌కు చెందిన 3కిలోల బరువుగల ఆశాట్ ఉపగ్రహాన్ని, బ్రిటన్‌కు చెందిన 6.5కిలోల బరువుగల స్ట్రాండ్-1 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్షలో ప్రవేశపెట్టారు.

### అంతరిక్ష వాణిజ్యం...

ఒకేసారి 7ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ద్వారా అంతరిక్ష వాణిజ్య రంగంలో ఇస్రో పెద్ద మైలురాయినే దాటింది. ప్రపంచ దేశాలన్నీ కూడా తమ ఉపగ్రహాల ప్రయోగానికి ఇస్రో వైపే ఎక్కువ ఆధారపడే అవకాశముంది. 2008లో ఒకేసారి పది ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టిన ఘనత ఇస్రో పేరిట వుంది. నిన్నటి ప్రయోగం ఇస్రో మీద మరింత నమ్మకాన్ని పెంచవచ్చు. 2002 నుండి ఇప్పటివరకు ఇస్రో 35విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించింది. అమెరికా, రష్యా, ఫ్రాన్స్‌లతో పోలిస్తే ఇస్రో ద్వారా ఉపగ్రహాలను ప్రయోగించడం చౌకగా వుండడంతో విదేశాలు ఎక్కువగా భారత్‌వైపే మొగ్గుచూపే అవకాశాలున్నాయి.

### షార్‌లో ఆనందతాండవం...

పిఎస్ఎల్‌వి-సి20 సక్సెస్ అయ్యిందనే సంకేతాలు రాగానే మిషన్‌కంట్రోల్ రూంలో ఎంతో ఉద్వేగంతో రాకెట్ గమనాన్ని వీక్షిస్తున్న శాస్త్రవేత్తలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు వ్యక్తం చేస్తూ ఒకర్నొకరు ఆలింగనం చేసుకున్నారు. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, గవర్నర్ నరసింహన్, సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిలు కూడా తమ ఆనందాన్ని వ్యక్తపరుస్తూ శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

# చెల్లెలు జనంలో...

(మొదటిపేజీ తరువాయి)

పార్టీలో కొంత గందరగోళం నెలకొనేది. జగన్ జైలులో వుంటే బయట పార్టీని నడిపే పరిస్థితి వుండేది కాదు.

కాని షర్మిల పాదయాత్ర కాంగ్రెస్ అధినేతల అంచనాలను తలక్రిందులు చేసింది. షర్మిల పాదయాత్ర జగన్‌ను జనం మనసుల్లో అలానే నిలిపింది. జగన్‌ను ప్రతిక్షణం గుర్తు చేస్తూనే వుంది.

ఇడుపులపాయలోని వైయస్ మహాసమాధి సాక్షిగా మొదలైన షర్మిల మరో ప్రజాప్రస్థానం పాదయాత్ర అలుపెరుగకుండా సాగుతూనే వుంది. కాలికి శస్త్ర చికిత్సవల్ల కొన్నిరోజులు పాదయాత్రకు తాత్కాలికంగా బ్రేకుపడ్డా, మళ్లీ మొండిధైర్యంతో షర్మిల పాదయాత్ర ప్రారంభించింది. ఇప్పటికే 77రోజుల పాదయాత్రలో ఆమె వెయ్యి కిలోమీటర్ల మైలురాయిని దాటి తన తండ్రి వై.యస్.రాజశేఖరరెడ్డి పాదయాత్ర రికార్డుకు చేరువలో వుంది. ఓ పక్క చంద్రబాబు పాదయాత్రలు జనం లేక వెలవెలబోతుంటే షర్మిల పాదయాత్రలో మాత్రం జనసముద్రమవుతున్నాయి. జగన్‌జైలులో వున్నా, అతనిని జనం గుండెల్లో ఆవిష్కరిస్తూ తండ్రి ఆశయాలకు, అన్న ఆలోచనలకు వారసురాలిగా షర్మిల పాదయాత్రతో 'అగ్ని' క్షిపణిలా దూసుకుపోతుంది.

# నెల్లూరులో చప్పుళ్ళు

(3వ పేజీ తరువాయి)

అనుభవిస్తున్న ఫిరోజ్‌ఖాన్‌ను ములాఖత్‌లో కలిసేందుకు మక్బూల్ ఓటరు ఐడికార్డును జిల్లా కేంద్ర కారాగార అధికారులకు ఇచ్చాడు. ఈ కార్డులో మక్బూల్, సైఫాబాద్, మలక్‌పేట అనే చిరునామా వుంది. కార్డులో వున్న ఫోటోలో మక్బూల్ తెల్లగడ్డంతో ఉన్నాడు. ఫిరోజ్‌ఖాన్ ములాఖత్ రికార్డుల్లో మక్బూల్ (ఫిరోజ్‌ఖాన్ స్నేహితుడు) అని వుంది. మక్బూల్ జైలులో ఫిరోజ్‌ఖాన్‌ను మాత్రమే కలిసినప్పటికీ... అదే జైలులో ఉన్న అబిద్‌హుస్సేన్‌తో సన్నిహిత సంబంధాలు ఉండవచ్చని పోలీసుల అనుమానం. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఫిరోజ్‌ఖాన్ హైదరాబాద్‌లో 2002లో జరిగిన ఒక హత్యకేసులో నేరం రుజువుకావడంతో జీవితఖైదు అనుభవిస్తున్నాడు చర్లపల్లి జైలులో జీవితఖైదు శిక్ష అనుభవిస్తున్న ఫిరోజ్‌ఖాన్ అక్కడ వున్న జైలు అధికారులతో గొడవపడడంతో 2011 ఫిబ్రవరి 16న నెల్లూరు కేంద్ర కారాగారానికి తర లించారు. గత రెండేళ్ళలో ఫిరోజ్‌ఖాన్‌ను ముగ్గురు వ్యక్తులు ములాఖత్‌లో కలువగా వారిలో ఒకరు ఫిరోజ్‌ఖాన్ సోదరుడు, రెండో వ్యక్తి మక్బూల్, మూడవ వ్యక్తి అఫ్సర్‌ఖాన్(పోలీసు కానిస్టేబుల్) అని తెలిసింది.


## FORM IV

(See Rule 8)

Statement about Ownership and other Particulars about News Paper, **Lawyer (Weekly)**

| | | |
|---|---|---|
| 1. | Place of Publication | : Plot No.1&2, MainRoad, Maguntta Layout, Nellore - 524 003. |
| 2. | Periodicity of its Publication | : Weekly |
| 3. | Printer's Name | : Thunga Siva Prabhath Reddy |
| | Nationality | : Indian |
| | Address | : Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 4. | Publisher's Name | : Thunga Siva Prabhath Reddy |
| | Nationality | : Indian |
| | Address | : Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 5. | Editor's Name | : Thunga Siva Prabhath Reddy |
| | Nationality | : Indian |
| | Address | : Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |
| 6. | Name and Address of individuals who won the News Paper and Partners or share holders holding more than one percent of the total Capital | : Thunga Siva Prabhath Reddy |
| | Nationality | : Indian |
| | Address | : Plot No.1&2, MainRoad, Magunta Layout, Nellore - 524 003. |

I, Thunga Siva Prabhath Reddy hereby declare that the particulars given above are true to the best of my Knowledge and belief.

(Sd)

01.03.2013 **SIVA PRABHATH REDDY.T**

PDF Compressor Free Version





ఫిబ్రవరి 27వ తేదీన నెల్లూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ప్రచార రథాన్ని పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, డిఆర్‌ఓ బి.రామిరెడ్డి

# 'మీ సేవ'ఋ అమోఘం

## నెల్లూరు అధికారులకు రఘువీరారెడ్డి ప్రశంస

నెల్లూరుజిల్లాలో మీ-సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు సేవలందించడంలో ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి రఘువీరారెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతిలో రీజనల్ రెవెన్యూ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి రఘువీరారెడ్డి జిల్లాలో అమలౌతున్న అభివృద్ధి కార్యక్రమాలపై, ఏడో విడత భూపంపిణీ తదితర వివరాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీ కాంతం మాట్లాడుతూ జిల్లాలో 205 మీ-సేవ కేంద్రాలను ఏర్పాటుచేశామని మరో 50కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 5.55లక్షల మంది లబ్ధిదారులకు మీ-సేవ ద్వారా సేవలందించినట్లు తెలిపారు. జిల్లాలో 19.50 లక్షల పంట నమోదుకు సంబంధించిన అడంగల్ రికార్డులను వెబ్‌ల్యాండ్‌లో ఉంచినట్లు తెలిపారు. జిల్లాలోని 97గ్రామాల్లో శ్మశాన వాటికలకు భూమి లేనట్లు గుర్తించామని, వీటిలో 68గ్రామాలకు ప్రభుత్వం భూమి కేటాయించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాలలో డిఆర్‌ఓ రామిరెడ్డి, గూడూరు సబ్‌కలెక్టర్ నివాస్, ఆర్డీఓ మాధవీలత, సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# 7 నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

నగరంలోని దర్గామిట్ట శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఉన్న మీనాక్షి సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో మార్చినెల 7వతేదీ నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సోమవారం ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ నేతృత్వంలో గుంజప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ సహాయ కమీషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి, వ్యవస్థాపక ఛైర్మెన్ రత్నం జయరాం, దాత ఆల్తూరి ఆదినారాయణరెడ్డి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు



## హమ్మయ్యా.. కిరణ్ వస్తున్నాడు

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి పర్యటన ఎట్టకేలకు ఖరారైనట్లు తెలుస్తుంది. ఈ నెల 3,4,5తేదీలలో ఇందిరమ్మబాటలో భాగంగా ఆయన జిల్లాలో పర్యటిస్తున్నారు. నెల్లూరులో వైద్య కళాశాలకు శంకుస్థాపన చేయటంతో పాటు సోమశిల హైలెవల్ కెనాల్‌కు శంకుస్థాపన, ఇంకా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు ఆయన పర్యటనలో భాగంగా వున్నాయి. ఆత్మకూరు, వెంకటగిరి, గూడూరు, నెల్లూరు, కోవూరు నియోజకవర్గాల్లో సిఎం పర్యటన ఉండబోతుంది.

## బాగా పనిచేయండి..

### డిసిఎంఎస్ ఛైర్మెన్ సుమంత్‌కు సిఎం అభినందన



ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆశీస్సులతో డీసీఎంఎస్ ఛైర్మెన్‌గా ఎన్నికైన యువరాజకీయవేత్త ఏడుగుండ్ల సుమంత్‌రెడ్డి 16వ తేదీ హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశాడు. జిల్లాలో రైతాంగం అభ్యుదయానికి కృషి చేయవలసిందిగా సుమంత్‌ని "కిరణ్" సూచించాడు. బాగా కష్టపడి పనిచేసి ఇచ్చిన పదవికి మంచిపేరు తీసుకురావాలని సుమంత్‌ని సి.యం కోరాడు.

# ముక్కాల, టంగుటూరిలకు సత్కారం



నెల్లూరు ఆర్‌టిసి బస్టాండు ప్రక్కన రోటరీ కల్యాణ మండపంలో గత నెల 24న నెల్లూరుజిల్లా ఛాంబర్‌ఆఫ్‌కామర్స్ ఆధ్వర్యంలో టంగుటూరి రామకృష్ణ, ముక్కాల ద్వారకానాథ్‌లకు అభినందన సత్కారం జరిగింది. కావలికి చెందిన టంగుటూరి రామకృష్ణ తమిళనాడులోని సేలం పెరియార్ విశ్వవిద్యాలయం సెనేటర్‌గా, ముక్కాల ద్వారకానాథ్ అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన శుభసందర్భంగా వారిని గౌరవంగా సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఛాంబర్ ప్రధాన కార్యదర్శి వొమ్మిన సతీష్‌బాబు, అధ్యక్షులు వొమ్మిన సుబ్రహ్మణ్యం, ఛాంబర్ జాయింట్ సెక్రెటరీ కె.శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాతృదేవోభవ



మా మాతృమూర్తి దైవసన్నిధికి చేరి
పద్దెనిమిదేళ్లు పూర్తయిన సందర్భంగా
ఆమె ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

ఆమె ఆత్మీయులైనవారందరికీ
మా మాతృదేవత ఆశీస్సులు కోరుకుంటూ...

నిర్యాణం: 1995, మార్చి 1వ తేదీ
స్వర్గీయ శ్రీమతి రుక్మిణమ్మ
(స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారి ధర్మపత్ని)

డా॥ టి.సుబ్బరామిరెడ్డి
రాజ్యసభ సభ్యులు
మరియు
వారి కుటుంబసభ్యులు

PDF Compressor Free Version



# కరుడుగట్టిన నరహంతకుడు

## దడ పుట్టించాడు



- మరో రెండుహత్యలతో సంబంధం
- దోపిడీ ఘటనల్లో ఇంతియాజ్ ముఠా హస్తం
- పోలీసుల అదుపులో మరో ఇద్దరు నిందితులు

**అతని ముఖం చూస్తే ఏమీ తెలియని అమాయకుడులా వుంటాడు. కాని అతను చేసే చేష్టలు కరుడుగట్టిన నరహంతకుడిలా వుంటాయి. ఒంటరిగా నివసించే మహిళల్ని టార్గెట్ చేసుకుని ఇంతియాజ్ ముఠా చేసిన దారుణాలు అన్నీ ఇన్నీ కావు.**

తప్పుచేస్తే ఎప్పుడో ఒకప్పుడు బయటపడతారనేందుకు నిదర్శనం ఈ సంఘటన. నెల్లూరు, బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన ఇంతియాజ్ ఆర్కిటెక్ట్ ఇంజనీరు. జల్సాలకు అలవాటుపడ్డ ఇంతియాజ్ తన బంధువైన అఖీల్‌అహ్మద్(18), మరో ముగ్గురు మైనర్లు ఉమర్(17), వంశీకృష్ణ(16), మురళీమనోహర్(17)లతో కలసి ముఠాగా ఏర్పడి తాను సంపాదించే డబ్బుతో వారికి కొత్త రుచులు అలవాటు చేశాడు. వారందర్నీ డబ్బు కోసం ఏ నేరమైనా చేసేందుకు మెంటల్‌గా సిద్ధం చేశాడు. వీరందరూ కలసి దాదాపు ఒకటిన్నర సంవత్సరంగా నగరంలోని చాలాప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. మూడో కంటికి తెలియకుండా దారుణాలకు ఒడిగట్టారు. మంచినీళ్లప్రాయంగా మనుషుల ప్రాణాలను తీశారు. నగలు, నగదు దోచుకుని జల్సాలు చేసారు. ఎవరికీ అనుమానం రాకుండా, ఆధారాలు దొరక్కుండా నేరాలు చేసుకుంటూ పోయారు. చివరికి హరనాథపురం రెండోవీధిలో నివసిస్తున్న తల్లీకూతురు శకుంతల, భార్గవిరెడ్డి హత్యలతో ఇంతియాజ్ ముఠా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న ప్రధాననిందితుడు ఇంతియాజ్‌ను నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి మూడురోజులు పోలీసు కస్టడికి తీసుకుని తమదైన స్టైల్లో విచారించగా ఎన్నో విషయాలు కక్కాడు. ఇంతియాజ్ ఇచ్చిన సమాచారంతో అఖీల్‌అహ్మద్, ఉమర్‌లను అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నారు. బాలాజీనగర్ ప్రాంతంలో నివసిస్తున్న పద్మమ్మ అనే వృద్ధురాలి వద్ద 15సవర్ల బంగారం దోచుకెళ్లారు. బాలాజీనగర్ మసీదువీధికి చెందిన వెంకటసుబ్బమ్మ, రామ్మూర్తినగర్‌కు చెందిన నారాయణమ్మను హత్యచేసి వారి ఒంటిమీద ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లినట్లు పోలీసుల విచారణలో నిందితులు తెలిపినట్లు సమాచారం. అంతేకాదు ఈ ముఠా నగరంలో పలుచోట్ల గొలుసు దొంగతనాలు, చోరీలకు పాల్పడినట్లు అంగీకరించింది. నాల్గవ, అయిదవ, బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్లలో సిఐలు రామారావు, రాజశేఖర్‌రెడ్డి, మంగారావులు ఇంతియాజ్ ముఠాపై ఎఫ్ఐఆర్, ఛార్జిషీటు తయారుచేసి కోర్టులో హాజరుపరచనున్నారు.



ఫిబ్రవరి 23వ తేదీన నెల్లూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో కోర్టు అదనపు భవనాలను ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి ఎన్.రామ్మోహన్‌రావు, పక్కన జిల్లా జడ్జి శ్రీరామమూర్తి, ఇతర న్యాయమూర్తులు

## రోడ్డుపైనే వంటా వార్పు...

# సమైఖ్యరాష్ట్రమే శ్రేయస్కరం



రోడ్డుపైనే వంటలు చేస్తున్న మహిళలు

రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని డిమాండ్ చేస్తూ సమైక్యాంధ్ర రాజకీయ, విద్యార్థి, ఉద్యోగ జేఏసి ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు జాతీయ రహదారిని దిగ్బంధంచేసి రహదారిపైనే వంటా వార్పును నిర్వహించారు. తెలంగాణ ప్రాంతజిల్లాల లారీ కార్మికులకు భోజనాన్ని పంపిణీచేశారు. ఈ సందర్భంగా నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుచేస్తే లాభపడేది కెసిఆర్ కుటుంబం ఒక్కటేనని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సమైక్యాంధ్రను కొనసాగించడం ఒక్కటే మార్గమన్నారు. రాష్ట్రాన్ని విడగొడితే కెసిఆర్ ముఖ్యమంత్రి, కోదండరాం ఆర్థికమంత్రి కావడం తప్ప తెలంగాణలోని సామాన్య ప్రజానీకానికి ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు.

అడ్వకేట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రశ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కేంద్రప్రభుత్వం త్వరగా ఏదో ఒకటి తేల్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగసంఘాల జేఏసీ, ఎన్‌జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్రబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలన్నీ సమైక్యాంధ్రను కోరుకుంటున్నాయన్నారు. విద్యార్థి జేఏసి రాష్ట్ర కన్వీనర్ కృష్ణయాదవ్ మాట్లాడుతూ వేర్పాటువాదులు తెలంగాణా కోసం జాతీయ రహదారుల దిగ్బంధనానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో సీమాంధ్ర ప్రజల మనోభావాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజెప్పడానికి సీమాంధ్రలోని 14యూనివర్శిటీల పరిధిలో జాతీయరహదారుల దిగ్బంధనం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై వంటావార్పు చేయడంతో ఇరువైపులా లారీలు, భారీ వాహనాలు బారులు తీరి నిలిచిపోయాయి.

ఈ కార్యక్రమంలో ఆనం రంగమయూర్‌రెడ్డి, నన్నేసాహెబ్, ప్రశాంతి, ఖాజామొహిద్దీన్, ముజీర్, ఆదిత్యసాయి అద్దంకి జగన్, పద్మజాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా "మైథిలి" వార్షికోత్సవం



నెల్లూరు వేదాయపాళెం లోని మైథిలీ ఇంగ్లీషుమీడియం స్కూలు వార్షికోత్సవం గత నెల 24న వైభవంగా జరిగింది. విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శన మన సంస్కృతిని ప్రతిబింబించింది. నృత్యాలలోని దేశభక్తి, సామాజిక స్పృహ అందరి మనస్సులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి గౌరవ అతిథులు నెల్లూరు ఎం.ఇ.ఓ, సి.హెచ్.రమేష్‌బాబు, క్యాన్సర్ హాస్పిటల్ కన్వీనర్ తుంగా శివప్రసాద్‌రెడ్డి, మోడరన్‌స్కూలు కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, రాధాకృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ మైథిలి మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్బన్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట పప్పుల వీధిలోని జేసీస్ భవన్‌లో ఫిబ్రవరి 24న నెల్లూరుజిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘంజిల్లా అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ మార్చి 14న ఆర్యవైశ్య సంఘం శాశ్వత భవనానికి తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య శంకుస్థాపన చేస్తారని, ఎస్‌బిఎస్ కల్యాణమండపంలో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఆయన సభకు పరిచయం చేసారు. చలువాది నాగేంద్ర, ముప్పసాని శ్రీనివాసులు, దుగ్గిశెట్టి అశోక్‌లు ఉపాధ్యక్షులుగా సరాబు సుబ్రహ్మణ్యం ప్రధాన కార్యదర్శిగా, గంగిశెట్టి మల్లి, కొండవీటి సుబ్బారావు, చలువాది నాగేశ్వరరావులు కార్యదర్శులుగా, పబ్బిశెట్టి శ్రీనివాసులు కోశాధికారిగా, చీతిరాల పద్మావతి మహిళా విభాగం అధ్యక్షులుగా, చలువాది ఉమా రాణి ఉపాధ్యక్షులుగా, పిండి వెంకటలక్ష్మి ప్రధాన కార్యదర్శిగా, గుండ్లపల్లి పద్మప్రియ కోశాధికారిగా ఎన్నికయినట్లు తెలిపారు. వాసవీ సేవాదళ్ కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నట్లు, వారి ప్రమాణ స్వీకారోత్సవం కూడా ఆరోజు జరుగుతుందని తెలిపారు.

# శ్రీ సిటిలో ఈఎంసీ పార్క్

తడలోని శ్రీ సిటీ ప్రత్యేక ఆర్థికమండలిలో ఎలక్ట్రానిక్ హార్డ్‌వేర్ మాన్యుఫాక్చరింగ్(ఈఎంసీ పార్క్) ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. శ్రీ సిటి యాజమాన్యానికి మాన్యుఫ్యాక్చర్ అసోసియేషన్ ఫర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(మెయిట్)తో ఇటీవల చెన్నైలో ప్రత్యేక ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా శ్రీ సిటీలో ఏర్పాటయ్యే ఈఎంసీ పార్కులో ఉత్పాదక వ్యవస్థలతో పాటు ఐటీ ఆధారిత ఉత్పాదక విభాగాలు, ప్రత్యేక పరీక్ష కేంద్రం వాటి విభాగాలు ఏర్పాటవుతాయి. ఈ పార్క్ మొదటి దశకోసం శ్రీ సిటి 100ఎకరాల స్థలాన్ని కేటాయించనుంది. అవసరాన్ని బట్టి రెండో దశలో మరో 50 ఎకరాల స్థలాన్ని కేటాయించే అవకాశం వుంది. మెయిట్ అధ్యక్షుడు జివి రమణమూర్తి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్వర్ సిర్పూర్ వాలా, శ్రీసిటి ఎండి రవిసన్నారెడ్డిలు పాల్గొన్నారు.

# ఏసిబి వలలో ట్రెజరీ తిమింగలాలు

- 65వేల నగదు స్వాధీనం
- అదుపులో నిందితులు

జిల్లా సబ్‌ట్రెజరీ కార్యాలయంలో 65వేలు లంచం తీసుకుంటూ ఎస్‌టిఓ ఇండ్ల వెంకటశేషయ్య, ఏటిఓ డ్రైవర్ థామస్ ఏసిబి అధికారులకు పట్టుబడ్డారు. ఏటిఓ డ్రైవర్ ప్రైవేటు వ్యక్తి, డ్రైవర్ తీసుకున్న సొమ్ము ఏటిఓ మోహన్‌రావుకు అందుతుందనే ఉద్దేశ్యంతో ఆయన్నుకూడా అదుపులోకి తీసుకున్నారు. చంద్రమోహన్‌రెడ్డి గత నెల 14న మెటీరియల్, సర్జికల్‌కు సంబంధించి 16.30లక్షల బిల్లులను ట్రెజరీ కార్యాలయ ఎస్‌టిఓ వెంకటశేషయ్యకు అందజేశారు. బిల్లులు మంజూరుచేసేందుకు ఆరు శాతం కమీషన్ క్రింద 90వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా ఈ మేరకు చంద్రమోహన్‌రెడ్డి ఏసిబి అధికారులను సంప్రదించాడు. ఏసిబి అధికారులు పథకం మేరకు చంద్రమోహన్‌రెడ్డి 65వేలను ఏటిఓ మోహన్‌రావు కారు డ్రైవరు థామస్‌కు అందజేశారు. వెంటనే ఏసిబి డిఎస్పీ విజయభాస్కర్‌రావు నేతృత్వంలో దాడులు నిర్వహించి ఎస్‌టిఓతో పాటు కారుడ్రైవరు థామస్‌ను అదుపులోకి తీసుకున్నారు. దాడుల సమయంలో ఎస్టీఓ వద్దగల 42వేలు, ఏటిఓ కారు డ్రైవరు వద్దగల 23వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌టిఓ ఏటిఓ, ఏటిఓ కారుడ్రైవరును ఏసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వీరిని సస్పెండ్ చేయనున్నట్లు ఏసిబి డిఎస్పీ తెలిపారు.

# అంతర్జాతీయ పోటీ పరీక్షకు "రత్నం" విద్యార్థి




మౌర్యను అభినందిస్తున్న రత్నం అధ్యాపక సిబ్బంది

స్పెల్‌బీ ఇంటర్నేషనల్ వారు చెన్నైలో జాతీయ స్థాయి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో నెల్లూరు రత్నం హైస్కూలు (లక్ష్మీపురం) 8వతరగతి విద్యార్థి వీవీయస్ మౌర్య రాష్ట్రస్థాయిలో 4వస్థానం సంపాదించాడు. రాష్ట్రం నుంచి 10మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి అర్హత సాధించారు. వీరిలో మౌర్య 4వస్థానం దక్కించుకున్నాడు. పాఠశాల డైరెక్టర్ రమావేణుగోపాల్, ప్రిన్సిపల్ మురళీమోహన్ విద్యార్థిని అభినందించారు.

# చెంచల్‌రావును వరించిన ఆప్కో పదవి

నెల్లూరులోని ఏడి కార్యాలయంలో ఫిబ్రవరి 24న ఆప్కో ఎన్నికలు జరిగాయి. ఆప్కో డైరెక్టర్‌గా వెంకటగిరికి చెందిన పడిధం చెంచల్‌రావు ఎన్నికయ్యారు. పదేళ్ల తరువాత జరిగిన ఈ ఎన్నికల్లో నక్కా కోటేశ్వరరావు, తంబా సోమశేఖర్‌లు పడిథం చెంచల్‌రావుతో పోటీపడగా నాలుగు ఓట్ల మెజారిటీతో చెంచల్‌రావు గెలుపొంది డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు.

## కదంబం



వాడెవడయితే నేం-
బియ్యపు గింజ మీద వ్యవసాయ చిత్రాన్ని గీస్తున్నాడు
తాజ్‌మహల్‌నో, భగవద్గీతనో, గాంధీనో
ఇందిరాగాంధీనో చిత్రించాల్సింది పోయి
ఉరేసుకొన్న రైతును చిత్రిస్తున్నాడు
నీటికాలువ పక్కన క్రాప్ హాలిడేను మోసే
బీడు పొలాన్ని గీస్తున్నాడు

మోటారు పంపు గొంతు పిసికి చంపాలని చూసే
కరెంటు తీగల్నీ, తీగల్లో లేని కరెంటునీ-
పైరు ఉసురు మట్టిలో కలపాలని యోచించే
నీళ్ల కాలువల్నీ, కాలువల్లో లేని నీళ్లనీ-
ఎంత జాగ్రత్తగా గీతార్చాన చేస్తున్నాడనీ!

పొలాల్లో, గాళ్లల్లో మేసేందుకు మేపులేక
నగరాల్లో మనుషులకు మేపుగా మారేందుకు
లారీలకెక్కే పశువుల్నీ, పశువుల్లేని పాకల్నీ గీస్తున్నాడు
విరిగిన నాగళ్లనీ, కళ్లెబోయిన కొడవళ్లనీ
ఇళ్ల ముందు బోర్లించిన గాదెల్నీ, గాదెల్లోలేని గింజల్నీ
ఒక కన్నీటి బొట్టులో చూపిస్తున్నాడు

అప్పిచ్చిన గొంతునీ, ఎదిగిన కూతుర్నీ
గిట్టుబాటు ధరలేక మూలన మగ్గే పంట ఫలాన్నీ చూసి
వణకిపోయే రైతు కళ్ళనూ, కళ్లలో లేని జీవాన్నీ
పాటను చేసి బియ్యపు గింజమీద శృతిజేస్తున్నాడు

భూమ్మిది బియ్యపు గింజల్నిండా
వ్యవసాయ చిత్రాల్ని గీస్తానంటున్నాడు
బియ్యపు గింజను కాన్వాసుగా వాడుకొనే హక్కు
పైరుకీ, దాన్ని పండించే మట్టీ బతుకులకీ
మట్టిలో నాటిన మునివేళ్లకి మాత్రమే ఉందంటున్నాడు
పేటెంటు కోసం దరఖాస్తు చేశానంటున్నాడు
రెండు వడ్లగింజల్ని కాడెద్దులుగా పూన్చి
రైతు జీవితాల్ని దున్ని ఫలవంతం చేసేవాడెవడైనా
ధైర్యంగా ముందుకొస్తే
అతని బొమ్మను కూడా బియ్యపు గింజమీద
చిత్రిస్తానంటున్నాడు

వాడెవడయినా కావొచ్చు-
చిత్రకారుడో, కవో, గాయకుడో
రైతు విత్తు కింద మట్టీ పొత్తిళ్లుగా మారాలనుకొనే
ఉద్యమకారుడో....
వాడికి నా కోటేరేసిన చేతుల్తో దండాలు
కాడిగట్టిన గుండెలతో వందనాలు

నన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
బాలరాజుపల్లె, 94412 87865.

## 'తెలుగుతేజం' కథలపోటీ

బెంగుళూరులోని "తెలుగుతేజం" మాసపత్రిక ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ సౌజన్యంతో ఉగాది చిన్న కథలపోటీ నిర్వహిస్తోంది. ఈ పోటీకి కథ అరఠావు సైజులో 4పేజీలకు మించకుండా వుండాలి. ప్రపంచంలో ఏ ప్రాంతమైనా కథకు నేపథ్యంకావచ్చు కాని అది తెలుగువారికి సంబంధించినదై హాస్యంతో పాటు సందేశాత్మకంగా వుండాలి. రచయిత(త్రి) పేరు, చిరునామా విడిగా రాతప్రతితో జతపరచాలి. కథాశీర్షిక మాత్రమే కథపైన రాయాలి. రచయిత పేరు వుండకూడదు.

మార్చి 31లోపు సంపాదకులు, బెంగుళూరు తెలుగుతేజం, నెం.150, 4వక్రాస్, ఆంధ్రాకాలనీ, నారాయణపురం, దూరవాణి నగర్‌పోస్ట్, బెంగుళూరు-560016 చిరునామాకు కథలు పంపాలి. 6 ఉత్తమకథలు ఎంపిక చేసి, ఒక్కో కథకు రూ॥1000 అందిస్తారు. కవరుపై "ఉగాది చిన్నకథల పోటీలు" అని రాయాలి. ఇంకేం... కథారచయిత(త్రు)లు త్వరపడండి.

## నెల్లూరు దోమలతో ఉగ్రవాదులకు చెక్

శ్రీను గల్పిక

అది శాంతిభద్రతలలో ఐఎస్‌ఓ 9001-2013 సర్టిఫికేట్ పొందిన భాగ్యనగరం. ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి సెక్రటేరియట్‌లోని తన ఛాంబర్‌లో కూర్చుని "పందంటి ప్రభుత్వానికి పన్నెండు రకాల సర్‌ఛార్జీలు" అనే కొత్త పథకానికి రూపకల్పన చేసాడు. దానిని ఏ విధంగా అమలుచేయాలనే దానిపై మంత్రులు, ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారు. అంతలో ప్యూన్ పరుగెత్తుకుంటూ లోపలకు వచ్చి... సార్, దిల్‌సుఖ్‌నగర్‌లో బాంబులు పేలాయంట అని చెప్పాడు. అది విన్న కిరణ్... ఇది దీపావళి సీజన్ కూడా కాదే.. అంత తీరిగ్గా బాంబులు కాల్చే సన్నాసులెవరు అని అడిగాడు. ఆ మాటకు వచ్చిన ప్యూన్ తల ఉషా సీలింగ్ ఫ్యాన్‌లా గిర్రున తిరిగింది. కొద్దిసేపటికి సర్దుకుని... సార్, అక్కడ పేలింది దీపావళి టపాకాయలు కాదు, నిజం బాంబులే, ఉగ్రవాదులు పేల్చారు. 15మంది దాకా చనిపోయారు. ఇంకా ఎంతోమంది గాయపడ్డారు అని చెప్పాడు. అక్కడే వున్న పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ... ఢిల్లీలో రేప్‌లు, హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లు కామనేగా! అయినా ఇంత చిన్న విషయాన్ని ఇంత హడావిడిగా వచ్చి చెప్పాల్నా, ఏదో కొంపలంటుకుపోయినట్లు మమ్మల్ని అదరగొట్టావే. వెళ్లవయ్యా, వెళ్లు అని గదమాయించాడు. తర్వాత అందరూ ఏఏ అంశాలమీద సర్‌ఛార్జీలు విధించాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించి, తర్వాత క్యాంటీన్‌కొచ్చి టీ తాగారు.

హైదరాబాద్‌లో బాంబు పేలుళ్ల గురించి టీవీఛానెల్స్ ద్వారా తెలుసుకున్న సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, సుశీల్‌కుమార్‌షిండే, గులాం నబీ అజాద్‌లు పక్కరోజే హైదరాబాద్ చేరుకున్నారు. వాళ్లకు విమానాశ్రయంలో గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ఘనస్వాగతం పలికారు. సుశీల్‌కుమార్ షిండే వుండి... మేం ఉగ్రవాదులు బాంబులు పెట్టే అవకాశం వుందని ముందే హెచ్చరించాం కదా ఎందుకు అప్రమత్తం కాలేదని సీఎం కిరణ్‌ను అడిగాడు. దానికాయన... నేను హోంమంత్రిని హెచ్చరించాను సార్ అని చెప్పాడు. అక్కడే వున్న సబిత... నేను మా డిజిపికి చెప్పేసాను సార్ అని అంది. అదివిన్న డిజిపి దినేష్‌రెడ్డి... నేను మా ఆక్టోపస్‌కు అప్పగించేసానని చెప్పాడు. అప్పుడు షిండే వుండి... దీనినిబట్టి అందరం అప్రమత్తంగానే వున్నాం... కాబట్టి ఇందులో మన తప్పేమీలేదు. మనం ఇంత అప్రమత్తంగా వున్నా కూడా బాంబులు పెట్టిపేల్చిన ఉగ్రవాదులదే అసలు తప్పు. వీలైనంత త్వరగా వాళ్లను పట్టుకుని జైలులో పెడదాం అని అన్నాడు. అక్కడే వున్న గులాంనబీ అజాద్ అందుకుని... ఇక్కడ ఒక్క బాంబు పేలుడుకే మీరు తెగ అదైపోతున్నారే... నేను జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడైతే అక్కడ బాంబు పేలుళ్లు లేని రోజంటూ వుండేది కాదు. ఏ రోజన్నా బాంబులు పేలకుంటే ఏదో వెలితిగా అనిపించేది. ఇంకో నాలుగైదుసార్లు పేలితే ఈ హైదరాబాద్ వాళ్లకు కూడా అదే అలవాటవుతుంది. బాంబులు పేలకుంటే నిద్రకూడా పట్టని పరిస్థితి వస్తుందని చెప్పాడు. అక్కడేవున్న ఆనం రామనారాయణరెడ్డి... నెల్లూరులో మాకు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు అలవాటయ్యాయి సార్, ప్రతిరోజూ అవి కరవనిదే నిద్రరాదు. ఇంకో నాలుగైదు బాంబు పేలుళ్లు జరిగితే హైదరాబాద్ వాళ్ల పరిస్థితి కూడా అంతేనన్నాడు. సోనియా గాంధీ వుండి... బాంబు పేలుళ్లు ఇలాగే జరుగుతూ పోతుంటే మన దేశపరువు ప్రతిష్టలు మంటకలుస్తాయి. ఉగ్రవాదాన్ని కఠినంగా అణచివేసే ప్రక్రియను చేపడుతామని అంది. అందుకు మన్మోహన్... అది కరెక్ట్ కాదేమోనని నా ఉద్దేశ్యం మేడమ్, చిన్నపిల్లోడు తప్పుచేసినప్పుడు మనం కొడితే వాడు అదే తప్పును పంతానికైనా మళ్లీ చేస్తాడు... అదే పట్టించుకోకుంటే ఆ పని చేయడం మానేస్తాడు. ఉగ్రవాదులు పేల్చిన బాంబుల వల్ల మనమేదో ఇబ్బందిపడ్డట్లు ఫీలయితే వాళ్లు అదే పనిని మళ్లీమళ్లీ చేస్తుంటారు. అదే గాంధీ సిద్ధాంతాన్ని ఫాలో అయ్యి... ఒకసారి కాదు, వందసార్లు పేల్చుకోండి బాంబులు అన్నట్లున్నామనుకోండి.. వాళ్లకు విసుగొచ్చి బాంబులు పేల్చడం మానుకుంటారు అని చెప్పాడు. దానికి సోనియా... మీరు చెప్పిన ఐడియా బాగానేవుంది గాని... ఇలాగే బాంబులు పేలుతూ పోతే వచ్చే ఎన్నికలలో మనకు ఓట్లు రావు, ఇకముందు బాంబులు పేలకుండా వుండే మార్గాల గురించి ఆలోచించండి అని చెప్పింది. సబితా ఇంద్రారెడ్డి అందుకుని... మేడమ్ నాదొక సలహా... ఉగ్రవాదులకు పునరావాసం ప్రకటిద్దాం... లొంగిపోయిన ఉగ్రవాదులకు అమీర్‌పేట సెంటర్‌లో వందంకణాల స్థలం, ఇల్లు కట్టుకోవడానికి పాతిక లక్షల రూపాయల లోను, దానికి ఋణమాఫీ, ఇంటికో ఉద్యోగం ప్రకటిద్దాం. ఉగ్రవాదులంతా లొంగిపోతారు. మావోయిస్టుల విషయంలో మేం ఇదే చేస్తున్నాం అని చెప్పింది. దానికి షిండే... అప్పుడు అసలు ఉగ్రవాదులకంటే దేశంలో నకిలీ ఉగ్రవాదులు ఎక్కువవుతారని అన్నాడు. సోనియా అసహనంతో... అసలు ఉగ్రవాదులు మన దేశంలోకి రాకూడదు, వచ్చినా బాంబులు పేల్చకూడదు. తీవ్రవాదులకు మన దేశంలోకి అడుగుపెట్టాలంటే టెర్రర్ అనిపించాలి. అలా ఏదన్నా ఐడియా వుంటే చెప్పండి అని అడిగింది. అప్పుడు ఆనం రామనారాయణరెడ్డి... ఇలాంటి ఐడియాలకు మా అన్నే కరెక్ట్ అంటూ... స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానంద రెడ్డి(63+)కు ఫోన్ చేసాడు. ఫోన్ ఎత్తిన వివేకాకు రామనారాయణరెడ్డి సమస్యను గురించి వివరించాడు. ఆయన ఫోన్‌లోనే దానికి పరిష్కారం చెప్పాడు.

★★★★★

పక్కరోజు అన్ని అంతర్జాతీయ వార్తాపత్రికలలో హెడ్‌లైన్స్... పాకిస్థాన్‌లో ఉగ్రవాద శిబిరాలు మూత... భయంతో అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లి పోయిన ఉగ్రవాదులు... అన్ని ఇంటర్నేషనల్ టీవీ ఛానెల్స్‌లో కూడా ఇదే ప్రధానచర్చ. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలు ఇంత అర్జంట్‌గా ఎందుకు మూతపడ్డాయి... అమెరికా బాంబులు వేసినా, డ్రోన్‌లతో దాడులు చేసినా లొంగని ఉగ్రవాదులు ఏ భయంతో పారిపోయారు.

★★★★★

అది ప్రధాని మన్మోహన్‌సింగ్ నివాసం. ఆయనతోపాటు సోనియా, షిండే, గులాంనబీ అజాద్, కిరణ్‌కుమార్‌రెడ్డి వున్నారు. జాతీయ, అంతర్జాతీయ మీడియా అంతా అక్కడ వుంది. బీబీసీ విలేకరి వుండి.... పాకిస్థాన్‌లో ఉగ్రవాద శిబిరాలు మూతపడ్డాయి. ఇది మీ పరిపాలనా సామర్థ్యం వల్లనా? లేక మీ భద్రతా దళాల ఘనకార్యమా? అని ప్రశ్నించాడు. దానికి మన్మోహన్.. అదేమీ లేదు. ఐఆర్ 20-420 నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమల మహిమ. ఉగ్రవాద కార్యకలాపాలను ఇక ఉపేక్షించేది లేదని, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై నెల్లూరు దోమలచేత దాడులు చేయిస్తామని, పట్టుబడిన ఉగ్రవాదులను నెల్లూరు దోమలచేత కరిపిస్తామని హెచ్చరించాం. ఆ హెచ్చరిక ఫలితమే ఈ పరిణామం అని చెప్పి ముగించాడు.

## బంగారు గరుడ వాహనంపై రంగనాథుడు



పినాకినీ నదీతీరాన వెలసియున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో గత నెల 25న బంగారు గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథుడు కొలువుతీరి పురవీధుల్లో విహారం చేసి భక్తజనులకు దర్శనమిచ్చారు. మాఘశుద్ధ పౌర్ణమి (వ్యాసపౌర్ణమి) సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కిదాంబి జగన్నాథాచార్యులు ఆధ్వర్యంలో విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలతో తిరుమంజనం చేశారు. అనంతరం ఆండాళ్ ఆరాధన నిర్వహించారు. సాయంత్రం బంగారుగరుడ వాహనంపై కొలువుతీరిన శ్రీస్వామి పురవీధుల్లో విహరించి భక్తులకు అభయమిచ్చారు. దారిపొడవునా భక్తులు రంగవల్లులతో స్వాగతం పలికి కర్పూరహారతులిచ్చి టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు పర్యవేక్షించారు. ఉభయకర్తలుగా మధుసూదన్‌రావు, నరేంద్రలు వ్యవహరించారు.

## ఎర్రచందనం దొంగలు అరెస్ట్

అటవీ సంపదను దోచుకోవడంలో స్మగ్లర్లు మరీ పేట్రేగిపోతున్నారు. అడవుల్లో లభించే ఎర్రచందనం చెట్లను యథేచ్ఛగా నరికేస్తూ పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. అటవీశాఖ అధికారులు ఇటీవల ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నప్పటికీ పిఎస్‌ఎల్‌వి రాకెట్‌కంటే వేగంగా స్మగ్లర్లు తమ పనికానిచ్చేసి ఎర్రచందనం దుంగలను సరిహద్దులు దాటిచ్చేస్తుండడం విశేషం.


గత నెల 25న రాపూరు రేంజ్ పరిధిలోని పెంచలకోన అడవుల్లో ఎర్రచందనం నరికేందుకు స్మగ్లర్లు తీసుకొచ్చిన కూలీలు 27మందిని అటవీశాఖ రేంజర్లు మారుతీప్రసాద్, యోగయ్యల ఆధ్వర్యంలో సిబ్బంది అరెస్ట్ చేశారు. అయితే స్మగ్లర్లు మాత్రం పరారయ్యారు. కూలీలను తమిళనాడు రాష్ట్రంలోని తిరునామలై జిల్లా నుంచి వీరు తీసుకొచ్చి చెట్లను నరికిస్తున్నారు. ఈ కూలీలంతా కేరళకు వెళ్ళి రోజుకు 70 రూపాయలు సంపాదించుకుంటుండగా, రోజుకు 300రూపాయలు ఇస్తామని చెప్పడంతో వారు ఈ పనికి వచ్చినట్టు తెలిసింది.

అధికారులు వీరిపై కేసులు నమోదుచేసి ఆత్మకూరు కోర్టులో హాజరుపరిచారు. కేసును పరిశీలించి న్యాయమూర్తి మార్చి 11వరకు రిమాండు విధించగా నిందితులను పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.

PDF Compressor Free Version



### మేషం



అశ్విని, భరణి, కృత్తిక 1 పాదము

వ్యవహారాల వ్యాపకం వల్ల, పనులవత్తిడి వల్ల టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుదల ఉంటుంది. మంగళ, బుధవారాలలో ఖర్చు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నది. ఉద్యోగులకు బాధ్యతలమార్పు అధికారుల ఆదరణ ఉంటుంది. ఉదరకోశ బాధలు, శరీరానికి గాయాలు తగలవచ్చును. విద్యాప్రగతి బాగుంటుంది.

### వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

ఎంత జాగ్రత్త వహించినా ఆర్థిక వ్యవహారాలలో ఇబ్బందులు చిక్కులుంటాయి. వృత్తిపరంగా సంతృప్తి, వ్యాపారవర్గాలకు స్వల్ప అభివృద్ధి ఉండి ఆదాయం ఫరవాలేదనిపించగలదు. ఆర్థికేతర పనులు సక్రమంగా జరుగగలవు. చర్మ కందర సంబంధమగు బాధలుంటాయి. అధికారిక, అనధికారిక ప్రయాణాలు నిర్ణయం కాగలవు. ఉద్యోగబాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

### మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

చేసేపనులందు ఆటంకాలను అధిగమించి ముందుకు సాగుతారు. ఆర్థికంగా బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం పెరుగుతుంది. స్థిరాస్తులు, షేర్లపై ఆదాయం పొందుతారు. హామీలు చెల్లింపులు సంతకాల విషయంలో జాగ్రత్త అవసరం. బిడ్డల వల్ల చిన్న సమస్యలుండి తొలగుతాయి. అనవసర విషయాలపై చర్చలు వదిలిపెట్టండి. విద్యాప్రగతి బాగుంటుంది.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అధికారులతో, రాజకీయవర్గాలతో జాగ్రత్తగా మెలగవలసి ఉంటుంది. వ్యాపారులకు, ఉద్యోగులకు అధికారుల వల్ల ఇబ్బందులుండవచ్చును కాని వెంటనే సర్దుబాటు కాగలవు. వ్యాపారరంగంలో స్తబ్దత ఉండి. ఆశాజనకంగా రాబడి ఉండదు. వైద్యశాస్త్ర సాంకేతిక, కళాక్రీడారంగాల వారికి అవకాశాలు బాగుండి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపారవర్గాలకు అవకాశాలు దొరికే సమయం. వృత్తిపరంగా వ్యాపకం పెరిగి ఆదాయం పెరుగుతుంది. సోమవారం నుండి వాహనాలు నడిపేవారు, కరెంటు పనులు చేసేవారు మేలకువగా ఉండాలి. భూములు స్థలాలు విలువైన వస్తువులు సమకూర్చుకొనేందుకు దృష్టి పెడతారు. క్రొత్త కాంట్రాక్టులు, పనులు లభించగలవు. సోదరుల కుటుంబాలకు మేలు జరుగగలదు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థిక వ్యవహారాలలో ఆచితూచి వ్యవహరించండి. హామీలు ఋణాలు ఇవ్వవద్దు. వృత్తి వ్యాపారరంగాల వారికి సరైన అవకాశాలుండగలవు. ఆదాయం తగ్గుతుంది. కోర్టుకేసులు ఉన్నచో వాయిదాపడటం, అవసరాలకు ఋణాలు చేయడం జరుగుతుంది. మాట తీరువల్ల ఇతరులతో తగాదాలు రావచ్చును. ఈ రాశి వారు ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకొనాలి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 1.3.2013 నుండి
తేది. 7.3.2013 వరకు

ఈవారం మేషంలో కేతువు. వృషభంలో గురువు. కన్యాతులవృశ్చికధనుస్సులలో చంద్రుడు. తులలో శనిరాహువులు. కుంభంలో రవిబుధ శుక్రకుజులు. 4తేది నుండి మీనంలో కుజుడు సంచరిస్తారు.

**పంచాంగము :**

శుక్ర మౌఢ్యమి జరుగుచున్నది.

**మాఘమాస కృష్ణపక్షతిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 01 | శుక్ర | చతుర్థి | రా॥ గం.10.57వ॥ |
| తేది. 02 | శని | పంచమి | రా॥ గం.9.06వ॥ |
| తేది. 03 | ఆది | షష్ఠి | రా॥ గం.7.03వ॥ |
| తేది. 04 | సోమ | సప్తమి | సా॥ గం.4.48వ॥ |
| తేది. 05 | మంగళ | అష్టమి | ప॥ గం. 2.25వ॥ |
| తేది. 06 | బుధ | నవమి | ప॥ గం.12.07వ॥ |
| తేది. 07 | గురు | దశమి | ఉ॥ గం.9.41వ॥ |


### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆలోచనలు వ్యాపకాలు పెరిగి టెన్షన్ పడుతుంటారు. అనుకోకుండా ఎక్కువ ఖర్చులు పెడుతుంటారు. వ్యాపారవర్గాలకు ఆర్థికాభివృద్ధికి అవకాశాలు దొరకడం, పెట్టుబడులకు అనుకూలత ఉంటుంది. ఉద్యోగులకు పని సామర్థ్యం, బాధ్యతలు పెరగడం, అధికారుల సహకారం బాగుంటుంది. సొంత నిర్ణయాలు చేయకుండా ఆత్మీయుల సలహా పొందడం చేయటం మంచిది.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

వృత్తి వ్యాపారాలలో శ్రమపడి గట్టి కృషి జరుపుతున్నా ఆదాయం అభివృద్ధి విషయాలలో అసంతృప్తి ఉంటుంది. తల్లివర్గ బంధువులకు అనారోగ్య బాధలుంటాయి. స్థిరాస్తులు వ్యవసాయ రంగాలలో జీవనం గలవారికి ఆర్థిక బాధలుంటాయి. అనుకున్న పనులు నిదానంగా సాగుతుంటాయి. యజమానులకు వర్కర్లతో తగాదాలు రావచ్చును. పరీక్షలపై విద్యార్థులు మంచి కృషి చేస్తారు.


### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

స్థిరాస్తులు లావాదేవీలందు, క్రొత్త పెట్టుబడుల విషయంలో అవకాశాలు బాగుంటాయి. బంధువర్గంతో విభేదాలు రావచ్చును. వైద్య కళాక్రీడా శాస్త్ర సాంకేతిక, న్యాయవాదరంగాలలో వ్యాపకం, గుర్తింపు, రాబడి బాగుంటుంది. కుటుంబసభ్యులతో కొద్దిపాటి సమస్యలు రావచ్చును. బంధువుల మిత్రులు మీ పనులందు సహాయం చేస్తారు. ప్రయాణాలుండి ప్రయోజనం పొందుతారు.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కార్య నిర్వహణలో విజయము, వస్త్ర, ధనలాభముంటుంది. కుటుంబసభ్యులతో అవగాహన బాగుండి. కుటుంబసౌఖ్యముంటుంది. వృత్తిపరంగా పనులు ఆదాయం పెరుగుతుంది. వ్యాపారవర్గాలకు అభివృద్ధి పెట్టుబడి అవకాశాలు బాగుంటాయి. మాటవేగం తగ్గించుకొనడం మంచిది. హామీలు మధ్యవర్తిత్వాలకు దూరంగా ఉండండి.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

పట్టుదలతో, ఆత్మీయుల సహకారంతో ముఖ్య పనులు జరుపుకొంటారు. వాణిజ్య విస్తరణ పెట్టుబడులు పెట్టడం వల్ల ఆదాయం పెరుగుతుంది. వ్యవసాయ పారిశ్రామిక వర్గాలకు ఆశ నిరాశల మధ్య నలగడం తప్పదు. ప్రభుత్వ అనుమతులు, క్రొత్త కాంట్రాక్టులు పొందుతారు. అభియోగాలు నిందలను తొలగించుకొంటారు. అనుకోని విధంగా ధనవస్తు లాభముంటుంది.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థికంగా ఇబ్బంది లేకపోయినా ఖర్చులు కొంత ఎక్కువే ఉంటాయి. అభియోగాలు నిందలు తొలగిపోయి బంధుమిత్రసౌఖ్యము బాగుంటుంది. శాస్త్ర సాంకేతిక రంగాల వారికి ఉద్యోగసౌఖ్యము, అధికారులతో మైత్రి బాగుంటుంది. అనుకున్న పనులు నిదానంగా సాగడం, కొద్దిపాటి ఆర్థికవత్తిడులుంటాయి.

# తిక్కన పార్కులో వైద్యశిబిరం



నెల్లూరులోని రంగనాయకులపేట పెన్నానది తీరం వద్ద ఉన్న తిక్కన పార్కులో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తిక్కన పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో దంత, గర్భకోశ, కంటి పరీక్షలు చేశారు. అసోసియేషన్ కార్యదర్శి పొత్తూరు శ్రీనివాసులు మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య సేవలందించాలనే సంకల్పంతో మెగా శిబిరాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వెలుగొండయ్య, కోశాధికారి వై.శేషారావు, కోట గురుబ్రహ్మం, గాదంశెట్టి గోపాల్, బయ్యా వెంకటరమణయ్య, బయ్యా ప్రసాద్, ఎంపీ ఆంజనేయులు, అమరామోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ బడ్జెట్‌పై కసరత్తు



బడ్జెట్‌పై అధికారులతో చర్చిస్తున్న కమీషనర్ టియస్ఆర్ ఆంజనేయులు

నెల్లూరు నగర కార్పొరేషన్‌కు సంబంధించి 2013-14 సంవత్సరం బడ్జెట్‌ను పూర్తిచేయాలని నగరపాలకసంస్థ కమీషనర్ టీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశించారు. సోమవారం తన ఛాంబరులో కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఆదాయం, ఖర్చులు, సిబ్బంది జీతాలు, వ్యయాలు తదితర వివరాలను ఆడిట్ విభాగానికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ భాగ్యలక్ష్మి, ఎం.ఇ.సంపత్, ఎంహెచ్ఓ సుబ్బరాజు, ఏసిపి వరప్రసాద్, ఎగ్జామినర్ ఆడిట్ విభాగం అధికారి గజపతిరావు తదితరులు పాల్గొన్నారు.

**బిపిఎల్ కొళాయి కనెక్షన్లపై సమావేశం:**
బిపిఎల్ కొళాయి కనెక్షన్లకు సంబంధించి కమీషనర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. కమీషనర్ మాట్లాడుతూ కొళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు స్పెషల్ డ్రైవ్ పెట్టుకున్నా ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. నూటికి నూరుశాతం లక్ష్యాలు సాధించకుంటే సంబంధిత డివిజను ఇంజనీరింగ్ అధికారులదే బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ విషయంపై ఫిట్టర్ల మీద ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు, ఫిట్టర్లు పాల్గొన్నారు.




## వధువు కావలెను — పెళ్లి సంబంధాలు — వరుడు కావలెను



1. 1985 డిసెంబరు 31 జననం. ఎత్తు 5'9". చదువు బి.టెక్(ఇన్‌డస్ట్రియల్ బయోటెక్నాలజీ, అన్నాయూనివర్శిటీ) యం.యస్(బయోటెక్నాలజీ, న్యూయార్క్), పి.హెచ్.డి(బయోకెమిస్ట్రీ, న్యూయార్క్). ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం ఆస్తివాటా 5కోట్లు. స్వస్థలం విజయవాడ.
2. 1983 అక్టోబరు 28 జననం. ఎత్తు 5'9". చదువు బి.టెక్(వాసవి ఇంజనీరింగ్ కాలేజ్, హైదరాబాద్, యం.యస్(అమెరికా). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్(శాప్ సి.ఆర్.యం) కంపెనీ గ్రెయిన్‌జర్.ఫార్చ్యూన్.500. అమెరికన్ కంపెని(చికాగో) హెచ్.వన్ వీసా. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్తివిలువ 3కోట్లు. స్వస్థలం ప్రకాశంజిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్. జీతం 106కె.
3. 1979 ఆగష్టు 23 జననం. ఎత్తు 5'6". చదువు బి.టెక్(ఐ.టి), యం.యస్(కంప్యూటర్స్), అమెరికా. ఉద్యోగం ప్రాజెక్టులీడరు, చిక్విటాబ్రాండ్ ఇంటర్నేషనల్(పర్మనెంట్). జీతం సం॥నకు 110కె. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్తివిలువ 3కోట్లు. ప్రస్తుతనివాసం హైదరాబాద్.
4. 1977 ఏప్రిల్ 1 జననం. ఎత్తు 5'8". చదువు యం.సి.ఏ ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఐ.బి.యం(బెంగుళూరు). జీతం నెలకు 1,25,000/-. ఉన్నతమైనరెడ్డి కుటుంబం. స్వస్థలం విశాఖపట్నం. ఆస్తివాటా 2కోట్లు.
5. 1980 మే 9 జననం. ఎత్తు 5'11". చదువు బి.కాం(కంప్యూటర్స్). వృత్తి బిజినెస్ ఆస్తివిలువ 7కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
6. 1987 ఏప్రిల్ 20 జననం. ఎత్తు 5'5". చదువు యం.బి.బి.యస్, యం.డి(డెర్మటాలజీ). ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం హైదరాబాద్. ఆస్తివాటా 3కోట్లు.
7. 1985 మార్చి 9 జననం. ఎత్తు 5'5". చదువు యం.బి.ఏ(అమెరికా). ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివాటా 50కోట్లు. స్వస్థలం బెంగుళూరు.
8. 1991 మార్చి 12 జననం. ఎత్తు 5'5". చదువు బి.టెక్(కంప్యూటర్స్), హైదరాబాద్. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివాటా 15కోట్లు. స్వస్థలం కడపజిల్లా.
9. 1988 మార్చి 12 జననం. ఎత్తు 5'3". చదువు యం.బి.బి.యస్(హైదరాబాద్), యం.డి(గైనిక్) ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివిలువ 25కోట్లు. స్వస్థలం హైదరాబాద్.
10. 1976 ఏప్రిల్ 23 జననం. ఎత్తు 5'9". చదువు బి.ఇ(ఎలక్ట్రానిక్స్), యం.యస్(ఎలక్ట్రానిక్స్)(అమెరికా). ఉద్యోగం అమెరికా (సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్). ఆస్తివాటా 20కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం బెంగుళూరు.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413. పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.
98480 34522
94406 39460.
పోస్ట్‌బాక్స్ నెం.4. C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.



## ఎవర్‌గ్రీన్ మన్మథుడు

నాగార్జున 53లో కూడా 23లా కనిపిస్తున్నాడు. ఆయన నటిస్తున్న 'గ్రీకువీరుడు' చిత్రంలో స్టిల్స్ చూస్తే ఈతరం కుర్రకారు హీరోలు కూడా ఆయన ముందు బలాదూర్ అనిపించేంత అందంగా ఉన్నాయి. ఏప్రిల్ 19న 'గ్రీకువీరుడు' రానున్నాడు.

# మూ 'వీ' క్షణం



## తిరిగొచ్చిన 'బాద్షా'



బాద్షా సినిమా కోసం యూరప్ వెళ్లిన యంగ్‌టైగర్ ఎన్టీఆర్ తిరిగి హైదరాబాద్ వచ్చారు. యూరప్‌లో ఎన్టీఆర్, కాజల్‌పైన కొన్ని పాటలను చిత్రీకరించారు. బండ్ల గణేష్ నిర్మిస్తున్న ఈ సినిమా ఆడియోను మార్చి 10వ తేదీన, సినిమాను ఏప్రిల్ 5వ తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## తనని నేను కలవలేదు



'బాహుబలి' సినిమాలో శృతిహాసన్ నటిస్తుందన్న ప్రచారాన్ని ఆ చిత్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి కొట్టిపారేశారు. అసలు ఆమెను ఈ సినిమా కోసం మేము సంప్రదించనే లేదని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సినిమాలో ప్రభాస్, రానా, అనుష్కలు ప్రధానపాత్రలు పోషిస్తున్నారు. కీరవాణి సంగీతమందిస్తున్నారు.

## క్యూట్ కేథరిన్



స్టైలిష్‌స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న 'ఇద్దరమ్మాయిలతో' సినిమాలో హీరోయిన్ ఒకరు అమలాపాల్ కాగా ఇంకొకరు కేథరిన్. అర్జున్‌ను ఇష్టపడి ప్రేమించే అమ్మాయిగా ఈ చిత్రంలో ఆమె కనిపించనుంది. ఈ సినిమాలో ఆమె పాత్ర చాలా గ్లామరస్‌గా కనిపించబోతుంది. 'చమ్మక్ చల్లో' తర్వాత ఆమెకిది రెండో సినిమా.

## 'సంతానం'గా మారనున్న బ్రమ్మి



సిద్ధార్థ, హన్సిక హీరోహీరోయిన్లుగా నటిస్తున్న తమిళ సినిమా 'తీయ వేల సేయనుం కుమరు' సినిమాలలో సంతానం పోషించిన పాత్రను తెలుగు వెర్షన్‌లో బ్రహ్మానందం పోషిస్తున్నారు.

## ఆ రోజులు మధురమైనవి



బాలీవుడ్, కోలీవుడ్, టాలీవుడ్... ఇలా అన్ని ఫీల్డుల్లో బిజీగా వున్న హీరోయిన్ కాజల్. సినీ జీవితంలో ఎంత బిజీగా వున్నా తన జీవితంలో మరపురాని మధురమైన రోజులు కాలేజీ రోజులేనని ఆమె అంటుంది.

# గూడూరు డివిజన్ వార్తలు

## పేదలకు వరం... నగదు బదిలీ

### కేంద్రమంత్రి పనబాక లక్ష్మి



జగన్మోహనరెడ్డిని సన్మానిస్తున్న పనబాక దంపతులు

కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న నగదు బదిలీ పథకం పేదలకు వరమని కేంద్రమంత్రి పనబాకలక్ష్మి అన్నారు. ఇటీవల గూడూరు పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద జిల్లా సహకార పరపతి సంఘం ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన నల్లపరెడ్డి జగన్మోహనరెడ్డి, దళిత యువనాయకుడు గిద్దలూరు ముత్యాలయ్య, ఇటీవల నియోజవర్గంలోని 24సొసైటీల కాంగ్రెస్ అభ్యర్థుల ఆత్మీయ సన్మాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్రమంత్రి పనబాకలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీ నగదు దళారుల పాలుకాకుండా ఆధార్‌కార్డు ఆధారంగా లబ్దిదారుల ఖాతాలోకి చేరుతుందన్నారు. గూడూరు నియోజకవర్గంలో నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి పనబాక కృష్ణయ్య ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంకోసం నిరంతరం కృషి చేస్తారన్నారు. డివిజన్ కేంద్రమైన గూడూరు పట్టణాన్ని రాబోవు ఒకటిన్నర సంవత్సర కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుండి అధికంగా నిధులు తీసుకొచ్చి మరింత అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పనబాక కృష్ణయ్య అన్నారు. 25ఏళ్లుగా కాంగ్రెస్‌పార్టీలో సామాన్య కార్యకర్తగా ఉండి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నానని, దానిని గుర్తించిన హైకమాండ్ ఏక గ్రీవంగా జిల్లా సహకార పరపతి సంఘానికి ఉపాధ్యక్షునిగా నియమించినందుకు కాంగ్రెస్‌పార్టీకి రుణపడి ఉంటానని జగన్మోహన్‌రెడ్డి అన్నారు. జగన్మోహన్‌రెడ్డిని పనబాక దంపతులు ఘనంగా సన్మానించారు. ఈ పదవికి కృషిచేసిన పనబాక దంపతులకు జగన్మోహనరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. కాగా హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన ఉగ్ర వాదదాడిలో 20మంది మృత్యువాత పడగా గూడూరులో ఆత్మీయ సన్మానసభకు విచ్చేసిన కేంద్రమంత్రి పనబాక లక్ష్మి ఆ దుర్ఘటన గురించి ప్రస్తావించకపోవడం కనీసం మౌనం పాటించకపోవడం వంటి చర్యల పట్ల స్థానికులు ఆవేదన చెందారు.

## కనువిందు చేసిన రాకెట్ ప్రయోగం

శ్రీహరికోట నుండి సోమవారం సాయంత్రం ప్రయోగించిన రాకెట్ గమనం గూడూరు వాసులకు కనువిందు చేసింది. ఈ రాకెట్ ప్రయోగాన్ని గూడూరు పట్టణంలోని పలువురు మిద్దెలపై నుండి వీక్షించారు. నిప్పులు చెరుగుతూ నింగిలోకి దూసుకొని వెళుతున్న రాకెట్ గమనాన్ని ప్రజలు ఎంతో ఆసక్తితో తిలకించారు. గూడూరుకు శ్రీహరికోట దాదాపు 65కిలోమీటర్ల దూరం ఉన్నా సోమవారం సాయంత్రం సరిగ్గా 6.01గంటలకు జరిగిన ఈ ప్రయోగాన్ని పలువురు ఆసక్తిగా వీక్షించారు.

## పల్స్‌పోలియో విజయవంతం



పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ డి.ఇ.సీతారామరావు

గూడూరు క్లస్టర్ పరిధిలో ఆదివారం 15,674మందికి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. గూడూరు పట్టణంలోని మాళవ్యానగర్, రైల్వేస్టేషన్, టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన పల్స్‌పోలియో కేంద్రం వద్ద ఆదివారం సబ్‌కలెక్టర్ నివాస్ పాల్గొని చుక్కల మందును వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ చుక్కల మందు వేయిస్తే పోలియోను అరికట్టవచ్చన్నారు. ఆసుపత్రి రోడ్డు వద్దనున్న పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రాంతీయ వైద్యశాల వద్ద ఏర్పాటుచేసిన కేంద్రాన్ని ఎస్‌పీహెచ్‌వో డాక్టర్ చంద్రయ్య చిన్నారులకు చుక్కల మందువేసి ప్రారంభించారు. హైస్కూల్ రోడ్డు రాజరాజేశ్వరి ఆలయం వద్ద కేంద్రంలో మున్సిపల్ కమీషనర్ సుశీలమ్మ, సిడిపివో శారదలు టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మున్సిపల్ డి.ఇ సీతారామరావు పాల్గొని పిల్లలకు చుక్కల మందు వేశారు. అనంతరం సీనియర్ ప్రజారోగ్యాధికారి డాక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ గూడూరు క్లస్టర్‌లోని పట్టణం, గూడూరు గ్రామీణం, చిల్లకూరు, మనుబోలు, ఓజిలి మండలాల పరిధిలో 15,674 మందికిగాను 14,918చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు తెలిపారు. ఈ పల్స్‌పోలియో కార్యక్రమంలో డాక్టర్ విజిత, సుగుణ, పురపాలక సంఘ కమీషనరు సుశీలమ్మ, సునీతాసేవాసంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు, వివిధ సేవాసంస్థల ప్రతినిధులు మునీంద్రరెడ్డి, మల్లిఖార్జున్, కె.సుందర రామిరెడ్డి, దశరథరామిరెడ్డి, జీడిరెడ్డి, కె.ఎస్.రెడ్డి, మునిగిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళు లేకుండా చేస్తారా?



ఆందోళన నిర్వహిస్తున్న లబ్ధిదారులు

గూడూరు పట్టణంలో అర్హులైన లబ్ధిదారులకు నేటి వరకు ఇళ్లు మంజూరుచేయకపోవడం పట్ల వైఎస్ఆర్‌సిపి ఆధ్వర్యంలో గత నెల 25న పట్టణంలో ఆందోళన నిర్వహించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ కేంద్రకమిటీ సభ్యుడు ఎల్లసిరి గోపాలరెడ్డి అధికారుల తీరును తీవ్రంగా ఎండగట్టారు. ఒక పథకం ప్రకారం వైఎస్ ప్రవేశపెట్టిన పథకాలను నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లు విజయకుమార్‌రెడ్డి మాజీ కౌన్సిలర్లు నాసిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, తాళ్ళూరు శ్రీనివాసులు, పి.రాజ్యలక్ష్మి ఎంబేటి చంద్రయ్య, గూడూరు రాజేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## నీటిఎద్దడి నివారించండి



డివిజనల్ పంచాయితీ అధికారి లక్ష్మణరావును కలిసిన దివిపాళెం ప్రజలు

గూడూరు మండలం దివిపాళెం పంచాయితీలో ఉన్న తీవ్ర నీటిఎద్దడి సమస్యను పరిష్కరించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు ఆప్రాంత ప్రజలతో కలసి గతనెల 25న స్థానిక డివిజనల్ పంచాయితీ అధికారి లక్ష్మణరావుకు విజ్ఞప్తి చేశారు. పంచాయితీలోని దండోరా కాలనీలో ఏడాదిన్నర క్రితం వాటర్ ట్యాంక్ నిర్మించినా ఇంత వరకు దాని నుండి నీటి సరఫరా జరగడం లేదన్నారు.

## యువతకు సేవాదృక్పథం ఉండాలి

### -- ఎక్సైజ్ డిసి చైతన్య మురళి --

యువతకు సమాజం పట్ల సానుకూల దృక్పథంతో ఉండాలని జిల్లా ఎక్సైజ్‌డిప్యూటీ కమీషనర్ చైతన్య మురళి పేర్కొన్నారు. గతనెల 25న స్థానిక సునీత సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన వారికి సర్టిఫికేట్లు ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మురళి ప్రసంగిస్తూ అన్ని దానాలోకల్లా రక్తదానం ఎంతో గొప్పదన్నారు. అనంతరం ఆయన సతీమణి సత్య మాట్లాడుతూ 100మంది గురువుల కన్నా ఓ తల్లి తమ పిల్లలను సన్మార్గంలో పెట్టడానికి వీలవుతుందన్నారు. సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు మాట్లాడుతూ అందరం కలసి ఒక ఆరోగ్యవంతమైన సురక్షిత సమాజానికి కృషి చేద్దామన్నారు. ఈ సందర్భంగా వాటంబేటి శివకుమార్, బాబులయ్య, దుర్గాప్రసాద్ లను డి.సి ఘనంగా సత్కరించి రక్తదానం చేసిన వారికి సర్టిఫికేట్‌లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కోటశ్రీనివాసులు ఎక్సైజ్ సి.ఐ రత్నం, సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సుబ్బులక్ష్మి పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# నీతి నిజాయితీలకు మారుపేరు సేతురామిరెడ్డి


సేతురామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కె.వి.రమణయ్య, సుకుమార్‌రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు

ఆశయాలు, ఆదర్శాల చిరునామాగా నిలిచిన కమ్యూనిస్టు యోధుడు గండవరం సేతురామిరెడ్డి ఇటీవల కీర్తి శేషులయిన సందర్భంగా నెల్లూరు స్టోన్ హౌస్‌పేటలోని అన్నదాన సమాజంలో ఫిబ్రవరి 27న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో సంతాపసభ జరిగింది. ముఖ్యవక్త సిపిఐ నగర కార్యదర్శి పసుపర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ నీతి, నిజాయితీలకు మారుపేరుగా సేతురామిరెడ్డి జీవించారని ప్రజాసమస్యలపై పోరాడుతూ వ్యక్తిగా కాకుండా శక్తిగా సేతురామిరెడ్డి ఎదిగారని అన్నారు. ఐదుసార్లు కౌన్సిలర్‌గా గెలిచి ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టి, సైకిల్‌పై ఇంటింటికి తిరుగుతూ ప్రతి ఒక్కరిని పలకరించే మంచి మనిషి సేతురామిరెడ్డి అని అన్నారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కె.అంజనేయులు మాట్లాడుతూ ఈ రోజున వున్న ట్రేడ్ యూనియన్‌లన్నీ ఆనాడు సేతురామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడినవేనన్నారు. డాక్టర్ మధుసూదన్‌శాస్త్రి మాట్లాడుతూ 1955లో కమ్యూనిస్టు పార్టీ భావాల పట్ల ఆకర్షితుడై సిపిఐ సభ్యత్వం తీసుకొని, రైతుసంఘాల సమస్యలపట్ల నిరంతరం పోరాడే వ్యక్తి సేతురామిరెడ్డి అని కొనియాడాడు. సభలో తొలుత సీనియర్ జర్నలిస్టు కె.వి.రమణయ్య సేతురామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎఐటియుసి నగర కార్యదర్శి తోట శ్రీనివాసులురెడ్డి, తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, కె.రాంబాబు, వై.రామయ్య, నాగేంద్రబాబు, లోకిరెడ్డి, శ్రీనివాసులు మొదలగువారు పాల్గొన్నారు.

# ప్రఖ్యాతకవి సోమసుందర్‌ను వరించిన 'ఈదూరు' పురస్కారం



నెల్లూరులో మూడేళ్ళ నుంచి ప్రతిఏటా సాహితీవేత్తలకు ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న 'ఈదూరు సుబ్బయ్య సాహితీ పురస్కారం' ఈయేడు 'వజ్రాయుధం'తో తెలుగునేల నలుచెరగులా కవిత్వ పరిమళాలు వెదజల్లిన ప్రఖ్యాత కవి డా॥ ఆవంత్స సోమసుందర్‌ను వరించింది. ఆవంత్స సోమసుందర్ 89ఏళ్ళ వయోభారంతో ప్రయాణం చేయలేని స్థితిలో వున్నందున ఆయన సొంత ఊరైన పిఠాపురానికి నెల్లూరు నుంచి వెళ్ళిన సాహితీమిత్రులు డా॥ ఈదూరు సుధాకర్, చిన్ని నారాయణరావు, ఈతకోట సుబ్బారావు, ఈదూరు సుబ్బయ్య మనుమడు రవి తదితరులు రూ॥ 10,000/- నగదు, దుశ్శాలువా, గంధపు మాల, చేతికర్ర వగైరాలతో వైభవంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆవంత్స స్పందిస్తూ ఈ సత్కారం స్ఫూర్తితో కొత్త కావ్యాన్ని రచిస్తాననడం ఎంతో సంతోషం. 2011లో తెలంగాణకు చెందిన కవి కందుకూరి శ్రీరాములును నెల్లూరులో, 2012లో రాయలసీమకు చెందిన ప్రముఖకవి జానుమద్ది హనుమచ్ఛాస్త్రిని ఆయన స్వంతవూరైన కడపలో ఈదూరు సుబ్బయ్య సాహితీ పురస్కారంతో గౌరవించారు. ప్రతిభకు పట్టం కట్టడమంటే ఇదేనేమో!

# కల్యాణ వైభవం!


గూడూరులోని నెల్‌క్యాస్ట్ ఫ్యాక్టరీ ఏజిఎం తలిశెట్టి గజపతి - శ్రీమతి ఈశ్వరిల కుమార్తె తపస్విని-మురళీధర్ ల వివాహం ఇటీవల గూడూరులోని డా॥ సిఆర్ రెడ్డి కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు

# జనం మధ్య వైకాపా నేతలు





సర్వేపల్లి నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు నగరంలో పి.అనిల్‌కుమార్ యాదవ్‌లు చేపట్టిన 'ప్రజాదీవెన' పాదయాత్రలకు అపూర్వ స్పందన కనిపిస్తుంది. టిపి గూడూరు మండలం పేడూరు నుంచి మొదలైన కాకాణి 'దీవెనయాత్ర' గురువారానికి మనుబోలు మండలంలోని కొమ్మలపూడికి చేరింది. ఇన్నిరోజుల యాత్రలో ఆయన ప్రతి గ్రామంలో ప్రజలను పలుకరిస్తూ వారి సమస్యలు సావదానంగా వింటూ ముందుకుసాగారు. అలాగే నెల్లూరు నగరంలో తూర్పు ప్రాంతంలో అనిల్‌కుమార్ పాదయాత్ర సాగుతుంది. ఆయన ఇంటింటికీ వెళ్ళి ప్రజలను పలుకరిస్తూ వారి సమస్యలను సావదానంగా వింటూ ముందుకు పోతున్నారు.

వీరి వెంట వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు.

## బాబును కలిసిన నెల్లూరు బాబులు

గుంటూరుజిల్లాలో పాదయాత్ర నిర్వహిస్తున్న చంద్రబాబునాయుడును జిల్లా తెలుగుదేశం నాయకులు గత నెల 25న కలిశారు. రేపల్లె నియోజకవర్గంలో జరిగిన పాదయాత్రలో ఆయనతోపాటు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు బీద మస్తాన్‌రావు, పరసా రత్నం, మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకట స్వామినాయుడులు కలిసి నడిచారు. ఈ సందర్భంగా చంద్రబాబు నెల్లూరు నాయకులతో మాట్లాడుతూ సహకార ఎన్నికలలో మీరంతా ఇంకొంచెం ఒళ్ళు వంచి పనిచేసి వుంటే ఇంకొన్ని సీట్లు పెరిగివుండేవని చెప్పారు. జగన్ అవినీతి గురించి ప్రజలు ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నారని, అధిక ధరలు, అవినీతి వంటి వాటితో ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో జగన్ గాలేమీ లేదని, మొన్న సొసైటీ ఎన్నికలలో ఆ పార్టీ మూడోస్థానానికి పోవడమే దీనికి ఉదాహరణని, బాగా కష్టపడి పని చేస్తే 2014లో అధికారం మనదేనని చెప్పారు. చంద్రబాబు మాటలతో మన బాబులకు ఒక్కొక్కరికి ఒక్కో కిలో బూస్ట్ తాగినంత ఎనర్జీ వచ్చి సంతోషంగా తిరుగు పయనమయ్యారు.

## పోటీల్లో మేటిగా నిలిచిన 'రత్నా'లకు బహుమతి ప్రదానం




నెల్లూరు సరస్వతినగర్‌లోని రత్నం ఒలింపియాడ్ స్కూల్‌లో జరిగిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గత నెల 23న ఐయంఏ హాలులో బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఒలింపియాడ్‌లో వ్యాకరణం, వక్తృత్వం, సంగీతం, క్విజ్, పాటల పోటీలు జరిపి విద్యార్థులలో వున్న అంతర్గత శక్తులను, సృజనాత్మకతను ప్రోత్సహిస్తున్న స్కూలు డైరెక్టర్లు డా॥కె.కృష్ణకిషోర్, వాసంతికిషోర్‌లు అభినందనీయులని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతి ప్రదానం చేసిన రైల్వే డియస్పీ జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని పోటీల్లో పాల్గొంటూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుతుండడం విశేషమని అన్నారు. ఉన్నత ప్రమాణాలతో, ఆశయాలతో నెలకొల్పిన డా॥కిషోర్స్‌రత్నం విద్యాసంస్థలు ఎప్పుడూ తమ విశిష్టతను ప్రదర్శిస్తున్నాయని పేర్కొన్నారు. మరో ముఖ్య అతిథి డాక్టర్ ఈదూరు సుధాకర్ మాట్లాడుతూ నేటి పోటీయుగంలో విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి.

కార్యక్రమంలో డా॥కిషోర్ రత్నం స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ఒలింపియాడ్ ప్రిన్సిపాల్ కె.వి.డి మనోజ్‌కుమార్, ఏఓ రుక్మిణి, ఉపాధ్యాయ, సిబ్బంది, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

## పర్యావరణ సదస్సుకు... వియస్‌యూ ఉపకులపతి



ఈ నెల 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు అమెరికాలో బోస్టన్‌లో జరగనున్న 'అంతర్జాతీయ ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ సదస్సు'కు విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.రాజారామిరెడ్డికి ఆహ్వానం అందింది. ఈమేరకు ఆయన గురువారం అమెరికా బయలుదేరి వెళ్లారు. యునైటెడ్ స్టేట్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజన్సీ పర్యవేక్షణలో జరగనున్న ఈ సదస్సుకు ప్రపంచ వ్యాప్తంగా 196 దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం విస్తృత పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలకు ఇచ్చే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'స్టార్' అవార్డును ఆయన అందు కోనున్నారు. ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందుకున్న రాజారామిరెడ్డికి 'లాయర్' అభినందనలు.

## అంతరిక్షాన్ని...
# అణువణువు చుట్టేద్దాం


ప్రయోగానికి ముందు మొదటి లాంచింగ్‌ప్యాడ్ వద్ద ప్రణబ్‌ముఖర్జీతో ఇస్రో ఛైర్మెన్ రాధాకృష్ణన్, షార్ డైరెక్టర్ ఎం.వై.ఎస్.ప్రసాద్

మీ ఆలోచనలకు ఆచరణ రూపమివ్వండి. వినూత్న ప్రయోగాలకు శ్రీకారం చుట్టండి. మీరు ఎన్నో విజయాలు సాధించారు. ఇంకా మరెన్నో విజయాలను సాధించాల్సి వుంది. ఎన్నో మైలు రాళ్లను అధిగమించాల్సి వుందని భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ఇస్రో శాస్త్రవేత్తలకు పిలుపునిచ్చారు. సోమవారం శ్రీహరి కోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగకేంద్రం నుండి ప్రయోగించిన పిఎస్ఎల్‌వి-సి20 విజయవంతమైన అనంతరం ఆయన శాస్త్రవేత్తలనుద్దేశించి మాట్లాడుతూ గత కొన్నేళ్లగా ఇస్రో ఎన్నో ప్రయోగాలు చేసి విజయం సాధించిందన్నారు. ఇస్రో ప్రయోగాలు భారత జాతి విశ్వాసాన్ని, అభిమానాన్ని చూరగొన్నాయని, షార్ నుండి జరిగే ప్రతి ప్రయోగాన్ని దేశ ప్రజలంతా ఆసక్తితో వీక్షిస్తున్నారని అన్నారు. ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచుకునేలా 'ఇస్రో' పనిచేయాలన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా శాస్త్రీయ పరిశోధనలను చేపట్టాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు. జిఎస్ఎల్‌వి విజయం కోసం దేశం ఎదురుచూస్తుందని అన్నారు. చంద్రయాన్-1 విజయం దేశం గర్వించదగినదన్నారు. అంగారక యాత్ర ప్రయోగాన్ని నిర్వహించి అగ్రదేశాలకు భారత్ ఏ మాత్రం తీసిపోదని చాటిచెప్పాలని ఆయన ఆకాంక్షించారు. అంతరిక్ష పరిశోధనలకు అయ్యే భారీ వ్యయాన్ని దేశం భరిస్తుందని, అదే స్థాయిలో ఫలితాలుంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశాన్ని అభివృద్ధి బాటన నడిపించే విజ్ఞాన ప్రయోగాలకు దేశ ప్రజలంతా మద్దతునిస్తారని ఆయన పేర్కొన్నారు.

# శాస్త్రవేత్తలు... శహభాష్




పిఎస్ఎల్‌వి సీ-20 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడానికి అహర్నిశలు శ్రమించి కృషిచేసిన ఇస్రో శాస్త్రవేత్తలు ఇస్రో ఛైర్మెన్ డా॥కె.రాధాకృష్ణన్, షార్ డైరెక్టర్ డా॥ఎంవైఎస్ ప్రసాద్, షార్ ఉద్యోగులకు రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇస్రో ఛైర్మెన్, షార్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఈ ప్రయోగం విజయం సాధించిందని, వీరి సారథ్యంలోనే అంతరిక్ష ప్రయోగాల్లో భారతదేశం ప్రపంచంలోనే కీర్తి పతాకంను ఎగురవేయాలని ఆకాంక్షించారు. ఇస్రో సహకారంతో సూళ్ళూరుపేట పట్టణానికి మహర్దశ పట్టనుందని అన్నారు. మంగళవారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మంత్రి ఆనం విలేకరులతో మాట్లాడారు. గతఏడాది సెప్టెంబర్ 9న శ్రీహరికోటకు విచ్చేసిన ప్రధానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే పరసా వెంకటరత్నం, చెంగాళమ్మ ఆలయ పాలక మండలి ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి కలసి సూళ్ళూరుపేట పట్టణాభివృద్ధి కొరకు విన్నపం చేశారని, ఈ ప్రక్రియ తుదిరూపం దాల్చిందన్నారు. ఇస్రో అధికారులు తాగునీరు, పారిశుధ్యం వైద్యం, విద్య అంశాలను ఎంచుకుని అభివృద్ధి చేయడానికి నిర్ణయించుకున్నారన్నారు.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.




## 12వ వర్ధంతి


స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు
నిర్యాణం - 06.03.2001

పూజ్యులు

**స్వర్గీయ వేమిరెడ్డి శివకోటారెడ్డి గారు**

స్వర్గస్తులై 06.03.2013 నాటికి
పన్నెండు సంవత్సరాలు నిండుతాయి.

వారి ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: వేమిరెడ్డి శ్యామలమ్మ
కుమారుడు: వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
కాంట్రాక్టర్, రామ్మూర్తినగర్, నెల్లూరు.

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY**, Executive Editor-**G.SREENIVASULU REDDY**.